

ఇలపైకి ఇంద్రధనుస్సు దిగి వచ్చింది. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా నారీమణులు వేసిన రంగవల్లులు మంత్రముగ్ధుల్ని చేశాయి. ముందే పండుగ వచ్చిందా!? అన్న రీతిలో ముగ్గులు ముచ్చటగొలిపాయి. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సహకారంతో ఆదివారం గిద్దలూరులో ఏర్పాటు చేసిన పోటీలకు విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ముగ్గుముచ్చట్లకు మనోహర రూపం ఇచ్చారు. సంక్రాంతి శోభకు వన్నెలద్దారు. పోటీలకు లక్ష్మీ డెయిరీ వ్యవస్థాపకులైన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరించారు.



గిద్దలూరులోని టెన్నిస్ కోర్టు ఆవరణలో జరిగిన పోటీలలో భారీగా పాల్గొని ముగ్గులు వేస్తున్న మహిళలు



గిద్దలూరులో జరిగిన ముగ్గుల పోటీలలో ప్రథమ బహుమతి విజేత టి.నాగదుర్గకు ఫ్రిజ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మార్కాపురం డీఎస్పీ నాగరాజు, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఐవీ సుబ్బారావు తదితరులు





ఎమ్మెల్యే నుంచి ద్వితీయ, తృతీయ బహుమతులు వాషింగ్ మిషన్, గ్రైండర్‌ను అందుకుంటున్న విజేతలు దివ్యశ్రీ, సరిత

మంత్రముగ్ధులై..

గిద్దలూరులో ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీలు

● భారీగా తరలివచ్చిన మహిళలు ● కిటకిటలాడిన టెన్నిస్ కోర్టు ఆవరణ

గిద్దలూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరులోని టెన్నిస్ కోర్టు సంక్రాంతి శోభను సంతరించుకుంది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో 201 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. నింగిలోని చుక్కలను నేలకు దించారు. తమ వేలికొనలతో ఒక్కో చుక్కను కలుపుతూ రమణీయమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. కొందరు సామాజిక స్పృహను జోడించారు. సంక్రాంతి విశిష్టతను, తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా పలువురు వేసిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. గిద్దలూరుకు చెందిన టి.నాగదుర్గకు ప్రథమ, పట్టణానికే చెందిన ఎ.దివ్యశ్రీకి ద్వితీయ, ఎస్.సరితకు తృతీయ బహుమతులు లభించాయి. ప్రథమ విజేతకు రిఫ్రిజిరేటర్, ద్వితీయ స్థానంలో నిలిచిన మహిళకు వాషింగ్ మిషన్, తృతీయ విజేతకు గ్రైండర్‌ను లోకల్ స్పాన్సర్ అయిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అందజేశారు. మరో ముగ్గురు మహిళలకు స్పెషల్ కన్సొలేషన్ బహుమతులు, మరో 10 మందికి కన్సొలేషన్ బహుమతులను ఇచ్చారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు ప్రత్యేక బహుమతితోపాటు గ్యాస్‌లైటర్, ఫైప్, మరికొన్ని బహుమతులను అందజేశారు.



చిన్నారిని ఒడిలో పెట్టుకొని ముగ్గు వేస్తున్న మహిళ

ముగ్గుల పోటీల నిర్వహణ అభినందనీయం



తెలుగు సంప్రదాయాలను గౌరవిస్తూ ఏటా 'ఆంధ్రజ్యోతి' పోటీలు నిర్వహించడం అభినందనీయం ఈ పోటీలో నాకు ప్రథమ బహుమతి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. నిష్పక్షపాతంగా విజేతలను ఎంపిక చేస్తారని అందరూ అంటుంటే విన్నాను. ఇప్పుడు చూస్తున్నాం.

- టి.నాగదుర్గ, ప్రథమ బహుమతి విజేత

మహిళలకు ప్రోత్సాహం



ఏటా పోటీల్లో పాల్గొంటాను. గతంలో కన్సొలేషన్ బహుమతులు వచ్చాయి. ఇప్పుడు ద్వితీయ బహుమతి లభించింది. ముగ్గుల పోటీలు మహిళల్లో సృజనాత్మకతను వెలికితీస్తాయి. ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఏబీఎన్, ఆంధ్రజ్యోతికి అభినందనలు.

- ఎ.దివ్యశ్రీ, ద్వితీయ బహుమతి విజేత

ఆనందంగా ఉంది



చాలాసార్లు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నాను. గత ఏడాది నంద్యాలలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది. ఈ ఏడాది కూడా బహుమతి వస్తుందని ఊహించాను. తృతీయ స్థానం లభించింది. చాలా ఆనందంగా ఉంది.

- ఎస్.సరిత, తృతీయ బహుమతి విజేత

జిల్లాలో 18,19,448 మంది ఓటర్లు

పురుషుల కంటే మహిళలే అధికం

కనిగిరి నియోజకవర్గం ఫస్ట్.. ఎర్రగొండపాలెం లాస్ట్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 18,19,448 మందికి చేరింది. ఈమేరకు జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం తుది జాబితాను ప్రచురించారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో పురుష ఓటర్లు 9,05,885 మంది, మహిళా ఓటర్లు 9,13,450 మంది, థర్డ్ జండర్లు 113 మంది ఉన్నారు. అదనంగా సర్వీసు ఓటర్లు 6,655 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 7,465 మంది ఎక్కువ. జిల్లాలో అత్యధికంగా కనిగిరి నియోజకవర్గంలో 2,40,356 మంది, అత్యల్పంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో 2,06,286 మందికి ఓటు హక్కు ఉంది. ఎర్రగొండపాలెం, దర్శి, మార్కాపురం నియోజకవర్గాల్లో స్వల్పంగా పురుషుల ఓట్లు అధికంగా ఉన్నాయి. మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లదే పైచేయి.



జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం పేరు	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్‌జెండర్	మొత్తం ఓటర్లు
యర్రగొండపాలెం	265	1,04,711	1,01,573	02	2,06,286
దర్శి	282	1,14,086	1,12,137	08	2,26,231
సంతనూతలపాడు	256	1,04,995	1,08,823	06	2,13,824
ఒంగోలు	259	1,15,058	1,24,417	52	2,39,527
కొండపి	283	1,18,367	1,20,878	03	2,39,248
మార్కాపురం	257	1,07,770	1,06,473	08	2,14,251
గిద్దలూరు	284	1,19,435	1,20,268	22	2,39,725
కనిగిరి	297	1,21,463	1,18,881	12	2,40,356
మొత్తం	2183	9,05,885	9,13,350	113	18,19,448



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పనితీరే ప్రామాణికం.. లేకుంటే తొలగింపు

ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆరు మాసాల లక్ష్యం

జిల్లాల వారీ శిక్షణ

శ్రమశక్తి సంఘాల పునర్‌వ్యవస్థీకరణ, మేస్త్రీల వ్యవస్థ ఏర్పాటు

నేడు ఒంగోలుకు పీఆర్ కమిషనర్ కృష్ణతేజ రాక

ఒంగోలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణాభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం మరింత ఉపయుక్తంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పథకం అమలులో కీలకమైన గ్రామస్థాయిలోని ఫీల్డ్ అసిస్టెంట్లను మరింత క్రియాశీలకంగా పనిచేయించాలని నిర్ణయించింది. రానున్న ఆరు మాసాలకు వారికి నిర్దిష్ట లక్ష్యాలను ఇవ్వనుంది. అందులో ఒక్కొక్కరి పనితీరును బేరీజు వేసి భవిష్యత్‌లో కొనసాగించడమా? తొలగించడమా? అన్నది నిర్ణయించనుంది. అదేసమయంలో గ్రామాలలో ఉపాధి కూలీలతో ఉన్న శ్రమశక్తి సంఘాలను పునర్‌వ్యవస్థీకరించి మేస్త్రీల వ్యవస్థను బలోపేతం చేయనుంది. ఆమేరకు ఇటీవల అన్ని జిల్లాల డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లతో గ్రామాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టత ఇచ్చారు.

వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలు

కేంద్ర ప్రభుత్వం నుంచి అధికంగా నిధులు వచ్చే ఉపాధి పథకాన్ని 2014-19 కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పెద్దఎత్తున సద్వినియోగం చేసింది. కూలీలకు పనుల కల్పన ద్వారా వేతనాలతోపాటు మెటీరియల్ కోటా నిధులు కూడా భారీగా వచ్చి పెద్దఎత్తున మౌలిక సదుపాయాల కల్పన జరిగింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధి పనులు పడకేశాయి. శ్రమశక్తి సంఘాలు నిర్వీర్యమయ్యాయి. మేస్త్రీల వ్యవస్థ లేకుండా పోయింది. ఫీల్డ్ అసిస్టెంట్ల పెత్తనం పెరిగింది. సుమారు వెయ్యి మంది కూలీలు పనులకు వచ్చే గ్రామంలో కూడా ఒక ఫీల్డ్ అసిస్టెంట్ పర్యవేక్షణ మాత్రమే ఉండటంతో అనేక అక్రమాలు, అవతవకలు చోటుచేసుకున్నాయి. పనిచేసే వారికి, చేయని వారికి ఒకే రకమైన వేతనాలు లభించాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు, స్థానిక వైసీపీ నాయకులు, మండల స్థాయిలోని డ్వామా సిబ్బంది కుమ్మక్కై అక్రమాలకు పాల్పడిన ఉదంతాలు అనేకం వెలుగు చూశాయి. ఈనేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఆదేశాలతో ఉన్నతాధికారులు ఆవైపు దృష్టి సారించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లు కీలకమని గుర్తించిన ప్రభుత్వం

ఉపాధి హామీ పథకం అమలులో ఫీల్డ్ అసిస్టెంట్లు కీలకమని గుర్తించి వారిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో అనేక చోట్ల ఇప్పటి వరకు పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్లను మార్పులు, చేర్పులు చేసి కొత్తవారిని నియమించారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 350 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు కొత్తగా నియమితులయ్యారు. మరో 300 మంది గతంలో ఉన్న వారే కొనసాగుతున్నారు.

రెండు రోజుల శిక్షణ

జిల్లా స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లకు రెండేసి రోజులు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మన జిల్లాలో సోమ, మంగళ వారాల్లో కార్యక్రమం జరగనుంది. తొలిరోజైన సోమవారం జిల్లాలోని 650 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత ఇతర అధికారులు, సిబ్బందికి ఒంగోలులో ఒక రోజు శిక్షణ ఇవ్వనుండగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ హాజరుకానున్నారు. 7వతేదీన క్షేత్ర స్థాయిలో ఈ సిబ్బందిని బృందాలుగా పంపి పనుల గుర్తింపు, ఇతరత్రా విషయాలపై అవగాహన కల్పించనున్నారు. రానున్న ఆరు మాసాలలో ఆయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు చేయాల్సిన పనులపై కూడా వారికి లక్ష్యాలను నిర్దేశించనున్నారు.

ఆరోగ్య పింఛన్లలో బోగస్‌లు

ఇప్పటికే కిడ్నీ రోగుల్లో భారీగా ఉన్నట్లు తేల్చిన అధికారులు

మంచంలో ఉన్నామంటూ పింఛన్‌లు పొందుతున్న 1,236 మందిపై దృష్టి

నేటి నుంచి 23 వరకూ విచారణ

ఇంటికి వెళ్లి పరీక్షించనున్న వైద్యులు



7



నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు ఎస్సీ కాలనీలో పర్యటిస్తున్న ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ మిశ్రా

జిల్లాలో ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ మిశ్రా పర్యటన

హాస్టళ్ల సందర్శన..

విద్యార్థులతో ముఖాముఖి

అభ్యసన సామర్థ్యాల పరీక్ష

ఎస్సీ కాలనీల్లో పర్యటిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..!

6

ఎస్సీ కాలనీల్లో పర్యటిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..

జిల్లాలో ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ మిశ్రా పర్యటన

హాస్టళ్ల సందర్శన.. విద్యార్థులతో ముఖాముఖి

అభ్యసన సామర్థ్యాల పరీక్ష



మద్దిపాడులోని బాలుర హాస్టల్‌ను పరిశీలిస్తున్న కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా

ఒంగోలునగరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎస్సీ కాలనీలకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. తొలుత ఒంగోలులోని ఎన్‌ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న ఆయన్ను కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేసు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్ మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా మిశ్రా జిల్లాలోని ఎస్సీల జీవన స్థితిగతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దిపాడులోని ఎస్సీ కాలనీని సందర్శించారు. స్థానికులతో ముఖాముఖి మాట్లాడి వారి జీవన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తరువాత స్థానిక ప్రభుత్వ బాలుర వసతిగృహాన్ని సందర్శించారు. విద్యాబోధనపై విద్యార్థులను ఆరా తీశారు. వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. వారితో పాఠ్యాంశాలను చదివించారు. అనంతరం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడును సందర్శించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. ప్రతి వీధికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారినుంచి అర్జీలను స్వీకరించారు. చివరిగా ఒంగోలు భాగ్యనగర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఆయన వెంట డీఆర్వో ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాలపాడు గ్రామంలో..

నాగులుప్పలపాడు: ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా ఆదివారం మద్దిరాలపాడు గ్రామంలోని అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్ కాలనీల్లో పర్యటించారు. ఆయా కాలనీల్లో నడుచుకుంటూ తిరిగి పలు గృహాలకు వెళ్లి కాలనీవాసులు, మహిళలతో మాట్లాడారు. తొలుత అంబేడ్కర్ కాలనీలో పర్యటించిన రాజీవ్‌రంజన్‌మిశ్రా సర్పంచ్ స్వర్ణ అనురాధతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె ఆయా కాలనీల్లోని సమస్యలను వివరించారు. వర్గీకరణ పేరుతో తమను విడగొట్టవద్దని కోరారు. పిల్లి నాగేంద్రం అనే వృద్ధురాలితో ఆయన మాట్లాడారు. అనంతరం జగజ్జీవన్‌రామ్ కాలనీని పరిశీలించారు. కాగా అంబేద్కర్ యువజన సంఘం యువకులు, చీర్వానుప్పలపాడు అంబేద్కర్‌కాలనీకి చెందిన మేడికొండ మురళీ, బహుజన కెరటాలు చప్పిడి కోటేశ్వరావు ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ నిలిపివేయాలని కోరుతూ వినతిపత్రాలను అందించారు. కార్యక్రమంలో డీడీ లక్ష్మానాయక్, డీఆర్వో చినఓబులేశు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వై.మహాలక్ష్మి, తాలూకా సీఐ అజయ్‌బాబు, ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా ఆదివారం మద్దిపాడు ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి ప్రజల జీవన స్థితిగతులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. స్థానిక బాలుర వసతిగృహానికి వెళ్లి అక్కడ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి టి.లింగయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంపీడీవో వి.జ్యోతి, సీఐ శ్రీకాంత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒంగోలు ప్రకాశంభవనంలోని పీజీఆర్ఎస్ హాలులో ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఆయా గ్రామాల్లోని ఎస్సీ వర్గానికి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు తమ అభిప్రాయాలు తెలుపవచ్చని, తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని ఎంపీడీవో జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు.

దివ్యాంగ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు నగరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దివ్యాంగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ ఉద్యోగుల సమస్యల పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బూరి రాము, నాయకులు కె.కోటేశ్వరరావు, ఎ.సురేష్, వి.చిరంజీవులు, ఆర్.కోటేశ్వరరావు, యు.కోటేశ్వరరావు, కె.విజయ, డి.శ్రీనివాసరావు, గట్లపల్లి సాయిజనార్దన్, ఎం.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కిలాడీ లేడీ

ఒంటరిగా నివాసం ఉండే వృద్ధురాళ్లే లక్ష్యం ● మత్తు మందు ఇచ్చి దోపిడీలు

ఒంగోలు క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా జిల్లా పోలీసు యంత్రాంగానికి ముచ్చెమటలు పట్టిస్తూ దోపిడీలకు పాల్పడుతున్న కిలాడీ లేడీ ఎట్టకేలకు దొరికినట్లు తెలుస్తోంది. పోలీసులు అత్యంత గోప్యంగా విచారిస్తున్నారు. ముఖ్యంగా ఒంటరిగా నివాసం ఉంటున్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడటం ఆమె నైజం. ఒంగోలుతో పాటు పరిసర ప్రాంతాలలో అనేక చోరీలు చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. అయితే ఈ కిలాడీ లేడీ పట్టపగలు దోపిడీకి వెళ్ళగా స్థానిక మహిళలు అనుమానించి పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. రెండు వారాల క్రితం ఒంగోలు నగరం సమతానగర్‌లో ఈ మహిళ దోపిడీకి పాల్పడింది. ఒంగోలులోనే నివాసం ఉంటున్న ఈ కిలాడీ ఏడాది కాలంగా పోలీసుల కళ్లు గప్పి అనేక నేరాలకు పాల్పడింది. దీంతో సదరు మహిళ ఎక్కడెక్కడ ఎన్ని దొంగతనాలు చేసింది, దొంగిలించిన సొత్తు ఏమి చేసిందనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. త్వరలోనే అన్ని వివరాలు బహిర్గతమయ్యే అవకాశం ఉంది.

ల్యాబ్‌టెక్నీషియన్ మృతి

నాగులుప్పలపాడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు ప్రాథమిక వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న గోవిందశర్మ (54) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. నాగులుప్పలపాడులోని స్వగృహంలో ఆయన మరణించడంతో వైద్యులు ఒనారియల్, నబీవలి, వైద్యసిబ్బంది గోవిందశర్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపం తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగుల పత్రాలను పరిశీలిస్తున్న వైద్యులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జీబీఆర్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులు గోపాళం శివన్నారాయణ, బి.హరిబాబు, చాపల వంశీకృష్ణ, ఎం.శరత్, జి.చైతన్య, రంజిత్‌బాషా, సుందర్‌ప్రసాద్, సమీర్‌లు వైద్యసేవలు అందించారని క్యాంపు కన్వీనర్ మాదాల వెంకట్రావు తెలిపారు. ప్రకాశంతో పాటు నెల్లూరు, బాపట్ల జిల్లాల నుంచి 1,575 మంది రోగులు వైద్యసేవలు పొందారన్నారు. చీమకుర్తికి చెందిన ప్రముఖ వైద్యులు బి.జవహర్ రూ.10వేలు, ఢాకా సుబ్బారెడ్డి రూ.10వేలు, ఆంజనేయులు రూ.5వేలు, కరవది సుబ్బారావు రూ.2వేలు శిబిరానికి ఆర్థిక సహాయం అందించారని ఆయన చెప్పారు.

కోర్సు డైరెక్టర్‌గా రమేష్

ఒంగోలు విద్య, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని రామచంద్రమిషన్‌లో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్‌గా సమగ్ర శిక్ష అకడమిక్ మానటరింగ్‌ఆఫీసర్(ఏఎంవో) ఎం.రమేష్‌ను నియమించినట్లు డీఈవో ఎ.కిరణ్‌కుమార్ తెలిపారు. కోర్సు డైరెక్టర్‌గా ఉన్న డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావు సస్పెన్షన్‌కు గురికావడంతో ఆయన స్థానంలో కోర్సు డైరెక్టర్‌గా రమేష్‌ను ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి నియమించారని ఆయన పేర్కొన్నారు.

సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

● నేటి నుంచి 18వ తేదీ వరకు అందుబాటులో...

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా పలు ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం 52 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 6 నుంచి 18వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జనవరి 6, 7 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (07077/07078), 8, 9, 11, 12, 15, 16 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (02764/02763) మధ్య 6 రైళ్లు అందుబాటులో ఉంటాయి. 13న వికారాబాద్-కాకినాడ టౌన్ (07037), 14న కాకినాడ టౌన్-చర్లపల్లి (07038) మధ్య రైళ్లు నడుస్తాయి. 9, 10, 16, 17 తేదీల్లో కాచిగూడ-తిరుపతి-కాచిగూడ మధ్య నాలుగు, 11, 12, 18, 19 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07035/07036) మధ్య 4, 12, 19 తేదీల్లో సికింద్రాబాద్-కాకినాడ టౌన్-సికింద్రాబాద్ మధ్య నాలుగు, జనవరి 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17, 18 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07033/07034)మధ్య పది రైళ్లు నడుస్తాయి. ఇక 8, 9, 10, 11, 12, 13, 14, 15 తేదీల్లో చర్లపల్లి-కాకినాడ టౌన్-చర్లపల్లి (07031/07032)మధ్య ఎనిమిది, జనవరి 6, 7, 13, 14 తేదీల్లో నాందేడ్-కాకినాడ టౌన్-నాందేడ్ (07487/07488) మధ్య నాలుగు, ఈనెల 9, 10, 12, 13, 14, 15 తేదీల్లో చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి (07025/07026) మధ్య ఆరు రైళ్లు అందుబాటులో ఉంటాయి. 7, 8 తేదీల్లో కాచిగూడ-శ్రీకాకుళం రోడ్-కాచిగూడ (07041/07042)మధ్య రెండు రైళ్లు నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు.

హెచ్‌ఎంలకు బదిలీల్లో అవకాశం కల్పించాలి

● ఎమ్మెల్యే దామచర్లకు విజ్ఞప్తి

ఒంగోలు విద్య, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రానున్న ఉపాధ్యాయుల బదిలీల్లో 2023లో ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి కూడా అవకాశం కల్పించాలని పలువురు ప్రధానోపాధ్యాయులు కోరారు. ఆదివారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. టీచర్ల బదిలీల ముసాయిదా చట్టంలో మే 31తేదీని కటాఫ్ తేదీగా నిర్ణయించడంతో తమకు బదిలీల్లో పాల్గొనే అవకాశం లేకుండాపోతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. బదిలీల్లో పాల్గొనేందుకు కనీస వ్యవధి రెండు సవత్సరాలుగా నిర్ణయించడంతో తమకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల తమకు బదిలీల్లో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పీఎం.ఖాన్, ఎంఎల్.శ్రీనివాసరావు, చినమీరావలి, అనంత పద్మనాభరావు, శిరీష, ఇందిర, సుబ్రహ్మణ్యం, ఏఎస్‌కే.ప్రసాద్ పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దిపాడు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో ఆదివారం మాదిగ ఉద్యోగుల కాలెండర్ ఆవిష్కరణ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో మాదిగల ఉద్యోగుల సమైక్య జాతీయ ఉపాధ్యక్షులు బొంత ఏసుదాసు, జిల్లా అధ్యక్షులు తేలరటి ఆనంద్, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి శేషయ్య, లక్కనబోయిన కోటేశ్వరరావు, కావూరి విజయరాజు, పాటిబండ్ల దేవరాజు, గుంటూరి ఆదాం, టి.నాగరాజు, పాటిబండ్ల మాణిక్యరావు, పాటిబండ్ల చిన్నకోటేశ్వరరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థినులు

టంగుటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : తాటిపర్తి వెంకారెడ్డి స్మారక ప్రతిభా పరీక్ష కొణిజేడులో స్థానిక ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఈపరీక్షకు జిల్లాలోని 35 పాఠశాలల నుంచి 412 మంది పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ప్రథమ బహుమతిని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పుట్టా వెంకటభార్గవి దక్కించుకున్నారు. ద్వితీయ బహుమతిని మార్కాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వైవీటీ చంద్రిక, తృతీయ బహుమతిని బండ్లమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్‌వీ నాగజాహ్నవి దక్కించుకుంది. మిగిలిన 32 ఉన్నత పాఠశాలల టాపర్‌లకు ఒక్కొక్కరికి రూ. 3వేలు చొప్పున అందించారు. వీరందరికి మెమెంటోలు అందజేశారు.ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు తాటిపర్తి గోపాలరెడ్డి, బత్తుల సుబ్బారెడ్డి, పొనుగుమాటి పెరుమాళ్లు, కొండపి మండల ఎంఈవో పచ్చవ రంగారావు పాల్గొన్నారు.

ఘనంగా జేసీఐ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

● హాజరైన ఎమ్మెల్యే దామచర్ల



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కల్చరల్), జనవరి 5(ఆంధ్రజ్యోతి): జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఒంగోలులోని బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. జేసీఐ 50వ అధ్యక్షునిగా ఎంవీ.సుబ్బారావు, ఒంగోలు చైర్మన్‌గా వెన్నపూస శ్రీరాములురెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా దామచర్ల జనార్దన్ హాజరై ప్రసంగించారు. జేసీఐ నిర్వహించే సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. సంస్థ 50వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక హైదరీ క్లబ్ దగ్గర నుంచి బచ్చల బాలయ్య కళ్యాణ మండపం వరకు విద్యార్థులు, పూర్వ అధ్యక్షులతో భారీ ర్యాలీ నిర్వహించారు. నూతన ప్రెసిడెంట్ సుబ్బారావు మాట్లాడుతూ జేసీఐకు శాశ్వత భవనం ఏర్పాటుకు కృషిచేస్తామని అన్నారు. వెన్నపూస శ్రీరాములు రెడ్డి మాట్లాడుతూ నగరంలో జేసీఐ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నామినేని మోహన్‌రావు, వీవీ.రమణ, శేఖర్‌బాబు, బొమ్మల శ్రీనివాసరావు, బి.ఆంజనేయులు, నందకుమార్, కసిబిసి నాగేశ్వరరావు, పవన్ కుమార్, గోపి కిషోర్, అద్దంకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్



మహాసభలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికాం ఎంప్లాయిస్ ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ మూడవ సర్కిల్ మహాసభలు ఆదివారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో జరిగాయి. పెండ్యాల ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ దేశంలో రైల్వే తర్వాత అత్యధికంగా ఉద్యోగులు ఉన్న సంస్థ బీఎస్ఎన్ఎల్ అన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చాక బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లోపించిందని విమర్శించారు. గత ప్రభుత్వాలు ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహిస్తే, ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తుందని ఆరోపించారు. ప్రైవేటు రంగ టెలికం సంస్థలకు 4జి సేవలకు వెంటనే అనుమతులు ఇస్తున్న కేంద్రం బీఎస్ఎన్ఎల్‌కు మాత్రం ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలన్నారు. ఏపీ సర్కిల్ జీఎం ఎం.శేషాచలం మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లోనే ఉద్యోగ భద్రత లభిస్తుందని, బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ఉద్యోగులు, కార్మికులు మరింతగా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఎఫ్‌టీఈ జాతీయ ప్రధానకార్యదర్శి చందేశ్వర్‌సింగ్ మాట్లాడుతూ టెలికాం రంగంలో వేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడంలో ఉద్యోగులు ఎక్కువ వత్తిడికి గురవుతున్నారన్నారు. కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం మరింతగా కుదించిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, జె.ఉమామహేశ్వరరావు, రమాదేవి, ఎం.ప్రసాద్‌బాబు, రఘుపతి, కె.అంజయ్య, సీహెచ్.చంద్రశేఖర్‌రావు, షేక్ అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి భారీగా తరలివెళ్లిన హిందువులు



ఒంగోలు, మద్దిపాడు నుంచి తరలి వెళుతున్న హిందువులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావం సభకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో హిందువులు తరలివెళ్లారు. గత నెల రోజులుగా జిల్లావ్యాప్తంగా ఉన్న రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్), విశ్వహిందూ పరిషత్, హిందూ జాగరణ మంచ్ తదితర హిందూ సంఘాల ఆధ్వర్యంలో హైందవ శంఖారావం గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇక హైందవ శంఖారావానికి హాజరయ్యే హిందువుల కోసం జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని పలు మండల కేంద్రాల నుంచి సైతం హిందూ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశారు. దీంతో హిందువులు ఈ సభకు భారీగా తరలివెళ్లారు.

మద్దిపాడు నుంచి..

మద్దిపాడు: విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం సభకు మండలంలోని హిందువులు రెండు బస్సుల్లో తరలివెళ్లారు. ఈ సభకు వెళ్లేందుకు వీలుగా మద్దిపాడు, మల్లవరం నుంచి ఆదివారం ఉదయం 8 గంటలకు బస్సులు బయల్దేరి వెళ్లాయి.

కొత్తపట్నం బస్టాండ్‌లో కారు బీభత్సం

మద్యం తాగి కారు నడిపిన యువకుడు

స్కూటీపై వెళుతున్న మహిళకు విరిగిన కాలు, కుమార్తెకు గాయాలు



డ్రైవర్‌ను పరీక్షిస్తున్న సీఐ, దెబ్బతిన్న పోలీసు కారు



గాయపడిన సంధ్య

ఒంగోలు క్రైం, జనవరి5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో మద్యం మత్తులో ఓ యువకుడు కారు నడిపి బీభత్సం సృష్టించాడు. స్థానిక కొత్తపట్నం బస్టాండ్‌లో టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి టంగుటూరుకు చెందిన వై.శ్రీనివాసరావు మద్యం మత్తులో ఏపీ39క్యూకే 5447 నంబరు గల కారులో కమ్మపాలెం నుంచి టూటౌన్ పోలీస్‌స్టేషన్ వైపు వెళుతు తాగిన మైకంలో నిర్లక్ష్యంగా నడిపాడు. అదే సమయంలో తూర్పుపాలెంలో నివాసం ఉండే తేళ్ల సంధ్య, ఆమె కుమార్తె స్కూటీపై ఇంటికి వెళుతున్నారు. దీంతో వారిని కారు ఢీకొనడంతో స్కూటీపై ప్రయాణిస్తున్న సంధ్య, ఆమె కుమార్తె కింద పడిపోయారు. సంధ్య ఎడమకాలు విరిగిపోగా, కుమార్తెకు గాయాలు అయ్యాయి. అదే సమయంలో కారు ఎదురుగా ఉన్న టూటౌన్ సీఐ వాహనం, అక్కడే పార్కు చేసిన రక్షక్ వాహనం ఢీ కొట్టాడు. దీంతో కొత్తపట్నం బస్టాండ్‌లో కొద్దిసేపు కలకలం రేగింది. అక్కడ ప్రయాణికులు, దుకాణాదారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వెంటనే సీఐ మేడా శ్రీనివాసరావు పోలీసు స్టేషన్ నుంచి బయటకు వచ్చి కారు నడుపుతున్న శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన సంధ్య, అమె కుమార్తెను ఆసుపత్రికి తరలించారు. కారు నడుపుతున్న శ్రీనివాసరావును బ్రెత్ ఎన్‌లైజర్‌తో పరీక్షలు నిర్వహించగా మద్యం తాగినట్లు గుర్తించారు. పూర్తి నిర్ధారణ కోసం రిమ్స్‌కు పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

● రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీ.ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లోని రైతు సంఘం కార్యాలయంలో వి.హనుమారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటుధరలు కల్పించాన్నారు. ఈనెల 8వతేదీన సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు గుండ్లకమ్మ ప్రాజెక్టు మరమ్మతులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, కొండయ్య, బాల్‌రెడ్డి, బాలకోటయ్య, వెంకట్రావు, సాంబశివరావు, బాలాజీరెడ్డి, వాసు, అంజయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బలమైన రైతు కూలీ ఉద్యమం నిర్మించాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగాన్ని కాపాడుకునేందుకు బలమైన రైతు కూలీ ఉద్యమాన్ని నిర్మించాల్సిన సమయం ఆసన్నమైందని పలువురు పేర్కొన్నారు. స్థానిక ఈమనిపాలెంలోని తరిమెల నాగిరెడ్డిభవన్‌లో ఆదివారం రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభల సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ చుండూరి రంగారావు, మాట్లాడుతూ సావనీర్‌ను అధ్యయనం చేయాలని కోరారు. కార్యక్రమంలో రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి డీవీఎల్.స్వామి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి, నాయకులు ఎంఎస్.సాయి, పరిటాల కోటేశ్వరరావు, శివరామకృష్ణయ్య, శ్రీను, జయబాబు, సామ్యూల్, జి.వెంకటరావు, ఐ.విజయసారథి, కత్తి పేరయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు విద్య, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. సుమారు 200 మందికిపైగా హాజరయ్యారు. వారంతా కాలేజీతో తమకు ఉన్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా ఇలా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీన్ చల్లా రామ్, ఫార్మసీ విభాగాధిపతులు, పూర్వ విద్యార్థుల కో ఆర్డినేటర్ మౌనిక, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీసీజీటీఏ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గం

ఒంగోలు విద్య, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీజీటీఏ) అధ్యక్షుడిగా డాక్టర్ మున్నంగి శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు కె.రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నూతన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎన్.శ్రీనివాసాచార్యులు ఎన్నికయ్యారు.

బడుగుల కోసం సీపీఐ పోరాటాలు

ఒంగోలు(రూరల్), జన వరి5(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన పార్టీ సీపీఐ అని సీనియర్ నాయకుడు ఉప్పుటూరి ప్రకాశరావు పేర్కొన్నారు. ఒంగోలు నగరం ముక్తి నూతలపాడులో ఆదివారం సీపీఐ శత వసంతాల వేడుకలను పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పార్టీ పోరాడిందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బొడపాటి సుబ్బారావు, సూదనగుంట శ్రీను, ప్రతాప్, ఆర్ల పూర్ణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రజకుల జీవనోపాధి కోసం సమగ్ర చట్టం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రజకుల జీవనోపాధి కోసం ప్రభుత్వం సమగ్ర చట్టం అమలు చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రాము కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగినరజకవృత్తిదారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకులు బతుకుదెరువు కోసం పట్టణాలకు వసల వచ్చి చాలీచలాని ఇరుకుగదుల్లో, అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్‌లుగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రజకవృత్తిదారులకు సబ్సిడీ రుణాలు, ఇస్త్రీదారులకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎ.రమణమ్మ, డాక్టర్ కృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, కొండయ్య, కలగుంట శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, యోగయ్య, పోలయ్య, వెంకటనారాయణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


ప్రథమ బహుమతి పొందిన ముగ్గుతో విజేత నాగదుర్గ


ద్వితీయస్థానంలో నిలిచిన ముగ్గుతో దివ్యశ్రీ


తృతీయ బహుమతిని సాధించిన ముగ్గుతో సరిత

ఇలపై ఇంద్రధనుస్సు

'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీలకు భారీగా తరలివచ్చిన మహిళలు

రంగవల్లులతో మెరిసిపోయిన గిద్దలూరులోని టెన్నిస్ కోర్టు ఆవరణ

గిద్దలూరు/ గిద్దలూరు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరులో సంక్రాంతికి ముందే పండుగ సందడి నెలకొంది. పట్టణంలోని క్లబ్ రోడ్డులో ఉన్న టెన్నిస్ కోర్టు రంగురంగుల రంగవల్లులతో కళకళలాడింది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టువారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సహకారంతో లక్ష్మీడెయిరీ వ్యవస్థాపకులైన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సంస్కృతి, సంప్రదాయ విలువలు 'ఆంధ్రజ్యోతి' నిర్వహి స్తున్న ముగ్గుల పోటీలలో కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయని బహుమతి ప్రదానోత్సవంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాల మేళవింపు సంక్రాంతి
- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

సంక్రాంతి అంటేనే సంస్కృతి, సంప్రదాయాల మేళవింపు అని ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి అన్నారు. వాటిని కాపాడేందుకే ఆంధ్రజ్యోతి ఏటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నదన్నారు. మహిళలు తమ ఇళ్ల ముందు అందంగా ముగ్గులు వేసుకుంటే నడిచేవారు కూడా వాటిని తొక్కకుండా వెళతారన్నారు. రంగవల్లులకు అంతటి గౌరవాన్ని ఇస్తారని చెప్పారు. పోటీల్లో పాల్గొన్న మహిళలు ఎవరికి వారే అద్భుతంగా రంగవల్లులను తీర్చిదిద్దారని ఆయన కొనియాడారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా మహిళలను ప్రోత్సహిస్తోందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉందని, గిద్దలూరు నియోజకవర్గంలో నేరాలు, ఘోరాలు జరుగకుండా బాగా పని చేస్తోందని ఎమ్మెల్యే ముత్తుమల కొనియాడారు. ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఐ.వి.సుబ్బారావు ముత్యాల ముగ్గుల పోటీల అధ్యక్షత వహించి మాట్లాడారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

అంతరించిపోతున్న కళలు : డీఎస్పీ నాగరాజు

ఎప్పటి నుంచో వస్తున్న అనేక రకాల కళలు ఆధునిక నాగరికత ప్రభావంతో అంతరించి పోయాయని డీఎస్పీ నాగరాజు అన్నారు. తెలుగు సంప్రదాయాలను, సంస్కృతిని ప్రజలు మరచిపోకుండా 'ఆంధ్రజ్యోతి' సంక్రాంతి సంబరాల పేరిట ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. మహిళలు అందమైన రంగవల్లులను తీర్చిదిద్ది పండుగ వాతా వరణాన్ని కల్పించారని ఆయన అన్నారు.

ఆంధ్రజ్యోతికి అభినందనలు

ఏటా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల నిర్వహించడం అభినందనీయమని మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. గిద్దలూరు అభివృద్ధి విషయంలో అందరూ ఐక్యంగా ముందుకు పోవాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో కాపు నాయకులు దుత్తా బాల ఈశ్వరయ్య, అర్బన్ సీఐ సురేష్, మాజీ సర్పంచ్ బత్తిని వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు దప్పిలి కాశిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆంధ్రజ్యోతి విలేకరులు పాల్గొన్నారు. ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా మాజీ సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి సతీమణి దప్పిలి నాగరాజేశ్వరి, వనితా కిట్టిపార్టీ నిర్వాహకురాలు శివపురం శ్రీదేవి, జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం అనూరాధ వ్యవహరించారు.

కన్సొలేషన్ విజేతలు వీరే..

ముత్యాల ముగ్గుల పోటీలలో స్పెషల్ కన్సొలేషన్ విజేతలుగా కె.విజయలక్ష్మి, బి.చంద్రకళ, ఎన్.సువర్ణలతలు ఎంపికయ్యాయి. వీరు ప్రత్యేక బహుమతులను అందుకున్నారు. అలాగే కన్సొలేషన్ బహుమతులను చోళ్లవీడుకు చెందిన వి.హైమావతి, అక్కలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆర్.లక్ష్మి, గిద్దలూరుకు చెందిన ఎస్.లక్ష్మీదేవి, దుద్యాల వందన, బొంతా చాముండేశ్వరి, టి.నరసమ్మ, ఎన్.రమాదేవి, కె.హైమావతి, ముప్పూరి శ్వేత, కెఎస్‌పల్లెకు చెందిన ఎం.పద్మలు వేసిన రంగవల్లులకు లభించాయి. వారికి లోకల్ స్పాన్సర్ అయిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కుక్కర్లను బహుమతుగా అందజేశారు.


బహుమతిని ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

పోటీల సైడ్‌లైన్స్

గిద్దలూరుకు చెందిన ఎ.దివ్యశ్రీ అనే గృహిణి తన నాలుగు నెలల శిశువుతో పాటు వచ్చి ఈపోటీలో పాల్గొని ముగ్గు వేశారు. ఈ పోటీలో దివ్యశ్రీకి ద్వితీయ బహుమతి కింద వాషింగ్‌మిషన్ లభించింది.

సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలకు పలువురు ముస్లిం మహిళలు వచ్చి అందంగా రంగవల్లులను తీర్చిదిద్దారు.

- ఆరు పదులు పైబడిన వయస్సులోని వృద్ధులు, అలాగే పదేళ్ల లోపు వయస్సు ఉన్న చిన్నారులు కూడా ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారు.


ఉత్సాహంగా ముగ్గు వేస్తున్న వృద్ధురాలు

ఆదివారం ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభం కానుండగా 8గంటలకే చాలా మంది టెన్నిస్ కోర్టు ప్రాంగణానికి విచ్చేశారు. తొలుత 150 బాక్సులను ఏర్పాటు చేయగా అత్యధిక సంఖ్యలో మహిళలు తరలిరావడంతో స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, నిర్వాహకులు అప్పటికప్పుడు మరో 51 మందికి అదనంగా ముగ్గులు వేసేందుకు బాక్సులు ఏర్పాటు చేశారు.


ముగ్గులు వేస్తున్న మహిళలు


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు




మోగిన శంఖం

కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతి, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి


సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు




సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద


హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం

ఆరోగ్య పింఛన్లలో బోగస్‌లు

నేటి నుంచి 23 వరకూ విచారణ

ఇంటికి వెళ్లి పరీక్షించనున్న వైద్యులు

జిల్లాకు ఐదు బృందాల ఏర్పాటు

ఒంగోలునగరం/కలెక్టరేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో ఆరోగ్య పింఛన్లను అడ్డగోలుగా మంజూరు చేశారు. వేలాది మంది అనర్హులు లబ్ధిదారులుగా మారిపోయారు. కిడ్నీలు బాగున్నా బాగోలేవని సర్టిఫికెట్లు పుట్టించారు. ఎలాంటి జబ్బు లేకుండానే కొందరు మంచానికి, వీల్‌చైర్‌కు పరిమితమైనట్లు మాయ చేసి నెలకు రూ.15వేలు పింఛన్ పొందుతున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్థులమంటూ మరికొందరు నెలవారీ రూ.10 వేలు తీసుకుంటున్నారు. అవన్నీ ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. జిల్లాలో హెల్త్ పింఛన్ లబ్ధిదారులు 2,436 మంది వరకూ ఉన్నారు. వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్నట్లు చూపి వీరు పింఛన్లు పొందుతున్నారు. కిడ్నీ రోగులమంటూ నెలవారీ పింఛన్లు పొందుతున్న 394 మందికి రిమ్స్ అధికారులు నెల క్రితం తిరిగి పరీక్షలు నిర్వహించారు. ఇందులో కేవలం 87మంది మాత్రమే వాస్తవంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు వెల్లడైంది. మిగిలిన వారు ఎలాంటి జబ్బు లేకపోయినా పింఛన్ కోసమే సరిఫికెట్లు సృష్టించి అక్రమంగా నెలకు రూ.10 వేలు పొందుతున్నట్లు తేలింది. ఇదే విషయాన్ని జిల్లా వెలుగు, డీఆర్‌డీఏ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అంటే మొత్తం కిడ్నీ రోగంతో పింఛన్లు పొందుతున్న వారిలో 80 శాతం బోగస్ అని తేలింది.

1,236 మంది రూ.15వేల పింఛన్

జిల్లాలో హెల్త్ పింఛన్లలో భారీగా బోగస్‌లు ఉన్నట్లు ఇప్పటికే ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. వైసీపీ పాలనలో ఈ బోగస్ ప్రక్రియ నిరాటంకంగా సాగిందని, ప్రభుత్వ సొమ్మును అనర్హులు అప్పనంగా నెలనెలా బొక్కేస్తున్నారు కొందరు కూటమి సర్కారు దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం కిడ్నీ బాధితులుగా పింఛన్‌లు పొందుతున్న వారిలో 80 శాతం బోగస్ అని తేలగా అంతకంటే ఎక్కువ శాతం మంది నెలవారీ రూ.15 వేలు తీసుకుంటున్న కేటగిరీలో ఉన్నారని అధికారులు భావిస్తున్నారు. మంచానికి, వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి ప్రభుత్వం నెలకు రూ.15 వేలు పింఛన్ ఇస్తోంది. అలాంటి వారు జిల్లాలో 1,236 మంది ఉన్నారు. వారిలో వెయ్యి మంది వరకూ బోగస్ ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణకు సిద్ధమయ్యారు. సోమవారం నుంచి 23వ తేదీ వరకూ విచారణ జరగనుంది.

ఐదు వైద్య బృందాలు ఏర్పాటు

మంచానికే పరిమితమై కానీ, వీల్‌చైర్‌లో కానీ ఉంటున్నామంటూ నెలకు రూ.15 వేలు తీసుకుంటున్న పింఛన్‌దారులను వారి ఇంటి వద్దకే వెళ్లి వైద్యులు పరీక్షించనున్నారు. అందుకోసం ప్రభుత్వం జిల్లాకు ఐదు బృందాలను ఏర్పాటు చేసింది. వీటిలో ఇద్దరు వైద్య నిపుణులు, ఒక మెడికల్ ఆఫీసర్, ఒక డిజిటల్ అసిస్టెంట్ ఉంటారు. నలుగురితో కూడిన ఒక్కో బృందం ఈ నెల 6 నుంచి 23వ తేదీ వరకు జిల్లాలో పర్యటించి రోగుల ఇంటి వద్దకే వెళ్లి పరీక్షించనుంది. ఇందుకోసం వైద్య నిపుణులను ప్రభుత్వం గుంటూరు జిల్లా నుంచి కేటాయించింది. ప్రస్తుతం మీ అర్హతను పరీక్షించేందుకు మీ ఇంటికే వైద్యనిపుణుల బృందం వస్తుందని తెలిపేదీతో సహా సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నారు.

బోగస్‌కు వైద్యారోగ్యశాఖ కేంద్రం

జిల్లాలో భారీగా హెల్త్ పింఛన్లు ఉండటానికి వైద్యారోగ్యశాఖ కార్యాలయమే కేంద్ర బిందువుగా పనిచేసిందన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయంలో ఆ సీటు చూసే అధికారి లబ్ధిదారుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు విమర్శలు ఉన్నాయి. రిమ్స్ వైద్యులు అర్హులకు ఇచ్చే సర్టిఫికెట్లను మార్ఫింగ్ చేసి అనర్హుల పేరుతో సర్టిఫికెట్లు సృష్టించింది కూడా ఈ అధికారే అని తెలుస్తోంది. ఈయన కనుసన్నల్లోనే హెల్త్ పింఛన్లలో భారీగా బోగస్‌లు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీసు ఎస్కార్ట్ వాహనాన్ని ఢీకొన్న బైక్

● మహిళా హెడ్ కానిస్టేబుల్‌తో పాటు ఇద్దరికి గాయాలు

నాగులుప్పలపాడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఎస్కార్ట్ వాహనాన్ని బైక్ ఢీకొనడంతో మహిళా హెడ్ కానిస్టేబుల్‌తో పాటు బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు గాయాలపాలైన సంఘటన మద్దిరాలపాడు వద్ద జరిగింది. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా ఆదివారం మద్దిరాలపాడు పర్యటనకు వెళుతున్న క్రమంలో ఆయనకు స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో పోలీస్ వాహనంలో ఎస్కార్ట్‌గా వస్తున్నారు. ఈక్రమంలో హైవే నుంచి మద్దిరాలపాడులోకి తిరుగుతున్న క్రమంలో చీరాల ప్రాంతానికి చెందిన పిట్టు అయ్యపరెడ్డి, కుంకుపూడి కార్తీక్‌లు మద్యం మత్తులో బైకపై ఒంగోలు వెళుతూ ఎస్కార్ట్ జీపు మధ్యభాగంలో ఢీకొట్టారు. దీంతో జీపు మధ్య సీటులో కూర్చున్న మహిళా హెడ్‌కానిస్టేబుల్ పరమేశ్వరి ఎగిరి వెనుక సీటులో పడటంతో గాయపడ్డారు. బైకు నడుపుతున్న ఇద్దరు యువకులకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం వారిని పోలీసు వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అనంతరం హెడ్‌కానిస్టేబుల్ పరమేశ్వరిని మెరుగైన చికిత్స నిమిత్తం పోలీసు సిబ్బంది కిమ్స్ వైద్యశాలకు తీసుకెళ్లారు.

శబరిమలలో డోలు విద్వాంసుడు గుండెపోటుతో మృతి

టంగుటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): టంగుటూరుకు చెందిన ప్రముఖ డోలు విద్వాంసుడు రాంబాబు(42) గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన శబరిమలలో జరిగింది. రాంబాబు స్వామి అయ్యప్పదర్శనం కోసం నడచివెళ్తుండగా అకస్మాత్తుగా శుక్రవారం గుండెపోటు వచ్చింది. వెంటనే ఆసుపత్రికి తీసుకుపోగా అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాంబాబు మృతదేహాన్ని ఆదివారం టంగుటూరుకు తీసుకువచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు.

అవీ..ఇవీ

పోలేరమ్మకు ఆదివారం జాతర



విశేష అలంకరణలో పోలేరమ్మ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గోదాదేవికి సారె సమర్పణ



గోదాదేవికి సారె సమర్పిస్తున్న మహిళా భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శివాజీనగర్‌లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోదా అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ మహిళా కమిటీ సభ్యులు, భక్తులు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ టీపీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎన్‌వీ రమేష్, కమిటీ సభ్యులు ప్రసాద్, వినయ్, జయరాం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దేవస్థాన కమిటీ ప్రతినిధులు

గిద్దలూరు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాల స్వామి దేవస్థాన ఆవరణలో యాదవ సమాజ అన్నసత్రం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆడిటర్ జంగాల బాలయ్య, దేవస్థాన, అన్నసత్రం కమిటీ ప్రతినిధులు ఒ.వెంకటయ్య, నంద్యాల శ్రీనివాసులు, వై.వెంకటేశ్వర్లు, గురువయ్య, బ్రహ్మం, రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోఆప్షన్ సభ్యుడికి ఎమ్మెల్యే పరామర్శ



జనార్దన్‌ను పరామర్శిస్తున్న అశోకొరెడ్డి

గిద్దలూరుటౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకున్న మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దమ్మాల జనార్దన్‌ను స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అమ్మవారిశాల అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, ఉపాధ్యక్షులు జిలకర సత్యం, కోశాధికారి ముప్పూరి చంటి, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉన్నారు.

ఈగలపాడు గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో

పొదిలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని ఈగలపాడు గ్రామాన్ని డీఎం హెచ్‌వో టి.వెంకటేశ్వర్లు ఆదివారం సందర్శిం చారు. గ్రామంలోని ప్రజలకు జ్వరం కీళ్లనొప్పులు ఉన్నాయనే సమాచారంతో ఆదివారం ఉప్పలపాడు, చందలూరు వైద్యాధికా రులతో కలిసి గ్రామాన్ని పరిశీలించారు. ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు. మొత్తం 365 గృహాలను సర్వే చేయగా 9 మందికి కీళ్లనొప్పులు, జ్వరాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారి రక్త నమూనాలను సేకరించి ఒంగోలు ప్రభుత్వ వైద్యాశాలకు పంపినట్లు చెప్పారు. గ్రామం లో నీటి పరీక్షలు చేశారు. లార్వా సర్వే చేసి మురికినీటి కాలువల వద్ద నీటిగుంటల్లో అబెట్ పిచికారి చేశారు. కార్యక్రమంలో డిఎంవో శ్రావణకుమార్, ఉప్పలపాడు వైద్యులు సుగుణకుమార్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అయితే చాలా కాలంలో గ్రామంలో సమస్య ఉన్నా, అధికారులు ఆలస్యంగా నిద్రలేవడంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఎస్సీ కాలనీల్లో పర్యటిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..!

- జిల్లాలో ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ మిశ్రా పర్యటన
- హాస్టళ్ల సందర్శన.. విద్యార్థులతో ముఖాముఖి



మద్దిపాడు ఎస్సీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న రాజీవ్ రంజన్ మిశ్రా

ఒంగోలునగరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎస్సీ కాలనీలకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. తొలుత ఒంగోలులోని ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న ఆయన్ను కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్ మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా మిశ్రా జిల్లాలోని ఎస్సీల జీవన స్థితిగతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మండల కేంద్రమైన మద్దిపాడులోని ఎస్సీ కాలనీని సందర్శించారు. స్థానికులతో ముఖాముఖి మాట్లాడి వారి జీవన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. విద్యా బోధన ఎలా ఉందని విద్యార్థులను ఆరా తీశారు. వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. వారితో పాఠ్యాంశాలను చదివించారు. అనంతరం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడును సందర్శించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. ప్రతి వీధికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారినుంచి అర్జీలను స్వీకరించారు. చివరిగా ఒంగోలు భాగ్యనగర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఆయన వెంటన డీఆర్వో ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే ఇంటి ముందు లీకవుతున్న నీరు, సప్తగిరి లాడ్జీ సమీపంలో ఓ ఇంటి వద్ద ట్యాపు, భూగర్భగనులశాఖ కార్యాలయం వద్ద కాలువలోకి పోతున్న లీకైన నీరు ఎమ్మెల్యే ఇంటి సమీప బజారులో నీటి వృథా

పైపులకు లీకులతో నీరంతా వృథా

- మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్య ధోరణి
- కొళాయిల నుంచి వృథాగా పోతున్న నీరు
- ఎమ్మెల్యే ఇంటి చుట్టుపక్కలే దారుణంగా ఉన్న పరిస్థితి

మార్కాపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మార్కాపురం మున్సిపాలిటీలో అధికార యంత్రాంగ నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో జవహర్‌నగర్ కాలనీలో నీటి సరఫరాను చూస్తే తేటతెల్లమవుతుంది. నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇంటికి చుట్టుపక్కలే పైపులు మరమ్మతులు చేయకపోవడంతో నీరు వృథా అవుతోంది. అక్కడి పరిస్థితులే వారి పనితీరును అద్దం పడుతున్నాయి. సాగర్ నీటిసరఫరా పట్టణానికి నాలుగు రోజులకు ఒకసారి జరుగుతోంది. ఈ క్రమంలో మధ్యలో ఇబ్బందులు తలెత్తినప్పుడు పట్టణవాసుల అవసరాల మేరకు సుమారు 80 డీప్‌బోర్ల ద్వారా కూడా నీటిని అందిస్తున్నారు. అన్ని వార్డుల్లోనూ ఈ సరఫరా నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. కానీ ప్రస్తుత వైసీపీ స్థానిక మున్సిపల్ పాలకవర్గం నిర్లక్ష్యధోరణితో పైపులు ఎక్కడికక్కడ పగిలిపోవడం, ట్యాపులు మరమ్మతులకు గురవడం తదితర కారణాలతో ఎంతో విలువైన నీరు వృథా అవుతోంది. ముఖ్యంగా స్థానిక 35వ వార్డులో చాలామంది ప్రముఖులు నివసిస్తున్నారు. వారిలో శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఇంటి చుట్టుపక్కలే పైపులకు మరమ్మతులు చేయకపోవడం, నూతన పైపులను ఏర్పాటు చేయకపోవడం లాంటి కారణాలతో వీధులు జలమయమవుతున్నాయి. స్థానిక జవహర్‌నగర్ కాలనీలో పరస్థితి మరీ దారుణంగా ఉంది. అన్ని వీధుల్లోనూ పైపులకు లీకులతో నీరంతా వృథాగా కాలువలపాలవుతోంది. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది మరమ్మతులు చేయడం లేదా నూతన పైపులు ఏర్పాటు చేసైనా వృథాను అరికట్టాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. పాలకులు కూడా ఈ విషయంపై దృష్టిపెట్టాల్సి ఉంది.

వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులు గోడపాలు

- రూ.60లక్షలు వృథా
- ప్రహరీలకే పరిమితమైన నూతన కార్యాలయ నిర్మాణం



ప్రహరీలు నిర్మించి వదిలేసిన ఏఎంసీ ప్రాంగణం

పొదిలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలకు అవసరమైన, మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో నూతన కార్యాలయం నిర్మిస్తారని ఆశించిన అవి అడియాసలుగానే మిగిలాయి. రైతులకు సేవలు అందించడం అటుంచి మార్కెట్ కమిటీ నిధులు కూడా వృథా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రైతులకు సేవలు అందించడంలో మాత్రం సంబంధిత శాఖ అధికారులు విఫలమౌతున్నారు.

పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, తర్లుపాడు మండలాలకు సంబంధించి వ్యవసాయ మార్కెట్ కమిటీని సుమారుగా 50 సంవత్సరాల క్రితం పొదిలిలో ఏర్పాటు చేశారు. దీని ద్వారా కేవలం ప్రభుత్వం నిర్దేశించిన నిధుల వసూలు లక్ష్యాలను అధిగమించడానికే ప్రాధాన్యతను ఇస్తున్నారు. లక్ష్యాలతోపాటు రైతుల అందించాల్సిన సేవలను గాలికి వదిలేస్తున్నారు. ఏఎంసీల పరిధిలో జోరుగా జీరో వ్యాపారం సాగుతున్నప్పటికీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక మార్కెట్‌కమిటీ నిధులతో రైతులకు అవసరమైన పనులు, పరికరాలు అందించడంలో నిర్లక్ష్యవైఖరిని ప్రదర్శిస్తున్నారు. ఏడాదికి కోట్లలో ఆదాయం వస్తున్నా ఇప్పటికీ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం అద్దెభవనాల్లోనే కొనసాగుతోంది. ఏఎంసీ నిధులతో లక్షలు వెచ్చించి నిర్మించిన గోడౌన్లు మాత్రం నిరుపయోగంగా ఉన్నాయి.

గత వైసీపి ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీ నిర్మాణం కోసం తలమళ్ల గ్రామ సమీపంలో ఒంగోలు నంద్యాల ప్రధాన రహదారి పక్కనే సుమారుగా 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఈ స్థలంలో కార్యాలయ భవనాలు నిర్మించకుండా కేవలం ప్రహరీగోడ నిర్మించారు. దీని కోసం 60 లక్షలు మార్కెట్ కమిటీ నిధులు కేటాయించారు. అప్పట్లోనే పరిపాలన భవనం నిర్మించకుండా రూ.60లక్షలతో ప్రహరీగోడ నిర్మాణం ఎందుకు చేపట్టారో మిలియన్‌డాలర్ల ప్రశ్నగా మిగిలింది. 2021 ఆగస్టు నెలలో ప్రహరీగోడ నిర్మించి ప్రధాన ద్వారానికి ఇనుపగేటును అమర్చారు. ఆరువాత వైసీపి పాలనలో చివరి మూడేళ్లలో కూడా భవన నిర్మాణాలకు అధికారులు చొరవ చూపలేదు. దీంతో ఆప్రాంతం మొత్తం చిల్లచెట్లతో నిండి చిట్టడివిని తలపిస్తోంది. విలువైన స్థలం కేటాయించినప్పటికి భవననిర్మాణ పనులు చేపట్టకపోవడంతో 60లక్షల నిధులు బూడిదలోపోసిన పన్నీరులా వృథా అయ్యాయి. అంతే కాకుండా ఏర్పాటు చేసిన గేటును ఇటీవల దొంగలు తాళాలు బద్దలుకొట్టి తీసుకుపోవడానికి ప్రయత్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాతనైనా మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చొరవ తీసుకొని పరిపాలన భవనంతోపాటు రైతులకు అవసరమైన గిడ్డంగులను ఏర్పాటు చేయాలని ఆయా మండలాల అన్నదాతలు కోరుతున్నారు.



అద్దెభవనంలో ఉన్న కార్యాలయం, తాళాలు పగలగొట్టి తీసిన గేటు

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రమణారెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం కె.ఎర్రయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులు, హాఫ్ పే లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బకాయిలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం పెండింగ్ బకాయిలు చెల్లించడంతో పాటు డీఏ, ఐఆర్‌లను ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో జాప్యం చేసిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వెంగళరెడ్డి, చల్లా శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి నాగయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు ప్రసాద్, కమలాదేవి, సీపీఐ నాయకులు అందె నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు బోల్తా.. పది మందికి గాయాలు

- క్షతగాత్రులు తర్లుపాడు ప్రాంతవాసులు

చిలకలూరిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట - నరసరావుపేట మార్గంలో కోటప్పకొండకు సమీపంలో ఈటీ వద్ద ఆదివారం రాత్రి ఓ బస్సు బోల్తా పడింది. ఈ సంఘటనలో పదిమంది గాయపడ్డారు. విజయవాడ గన్నవరం లో ఆదివారం జరిగిన హైందవ శంఖారావానికి ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలోని తర్లుపాడు గ్రామానికి చెందిన వారు 35 మంది బస్సులో వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్టీరింగ్‌కు సమస్య ఏర్పడి బస్సు అదుపుతప్పడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గాయపడిన వారిని అంబులెన్స్‌లు, 108 వాహనాల్లో నరసరావుపేట, చిలకలూరిపేట ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది.

ముతవల్లీల నూతన కమిటీ ఎన్నిక



మిర్జా సప్దర్ అలీబేగ్, షేక్ కరిముల్లా

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని మస్జీద్‌ల ముతవల్లిల నూతన కమిటీ ఎన్నిక స్థానిక మదినా మస్జీద్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముతవల్లిల కమిటీ అధ్యక్షులుగా మిర్జసప్దర్ అలీబేగ్(మర్కస్ జామియా మస్జీద్), ప్రధాన కార్యదర్శిగా షేక్ కరిముల్లా(మదినా మస్జీద్)లు ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా షేక్ బాషా(ఆటో నగర్ మస్జీద్), మహమ్మద్(అన్సార్ మస్జీద్), ఉపాధ్యక్షులుగా షేక్ మున్నా(ఇస్లాంపేట), మహబూబ్ పీరా(మక్కా మస్జీద్), కోశాధికారిగా షేక్ షఫీ(ఇందిరమ్మ కాలనీ మస్జీద్), గౌరవ అధ్యక్షులుగా అబ్దుల్ రజాక్(చిన్న మస్జీద్), గౌరవ సలహాదారులుగా మినా, కౌసర్ మస్జీద్‌ల ముతవల్లిలు, షేక్ షఫీవుల్లా, షేక్ రెహమాన్‌లు ఎన్నికయ్యారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

నాలుగున్నర దశాబ్దాల తర్వాత కలుసుకున్న నాటి పదో తరగతి విద్యార్థులు



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మార్కాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1979-80 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సుమారు 44 సంవత్సరాల తర్వాత అందరూ ఒక వేదికపై వచ్చి గతస్మృతులను నెమరవేసుకున్నారు. ఉద్యోగ, వ్యాపారరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడి వాళ్లు కూడా దశాబ్దాల తర్వాత కలవడంతో ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొని తన్మయత్వంలో మునిగి తేలారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కదం శ్రీనివాసరావు, సోమయాజుల సుబ్బశాస్త్రి, సుభాని, గుప్తాప్రసాద్, ఆర్‌వీఎస్ ప్రసాద్, బండి శ్రీనివాసరావు, దేసు వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా .. ఒకరి మృతి



మృతిచెందిన దాసరి పండు

కంభం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని యర్రబాలెం సమీపంలో చోటుచేసుకొంది. బేస్తవార పేట మండలం కొత్తపేట, అక్కపల్లి గ్రామాలకు చెంది న వారు ఆటోలో రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కంభం మండలం యర్రబాలెం గ్రామ సమీపంలోని మారుమూల మలుపు వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటో బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న దాసరి పండు (35) మృతిచెందాడు. సామ్యూల్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ మేరకు కంభం ఎస్సై నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

- నేటి నుంచి 18వ తేదీ వరకు అందుబాటులో

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా పలు ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం 52 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 6 నుంచి 18వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జనవరి 6, 7 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (07077/07078), 8, 9, 11, 12, 15, 16 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (02764/02763) మధ్య 6 రైళ్లు అందుబాటులో ఉంటాయి. 13న వికారాబాద్-కాకినాడ టౌన్ (07037), 14న కాకినాడ టౌన్-చర్లపల్లి (07038) మధ్య రైళ్లు నడుస్తాయి. 9, 10, 16, 17 తేదీల్లో కాచిగూడ-తిరుపతి-కాచిగూడ మధ్య నాలుగు, 11, 12, 18, 19 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07035/07036) మధ్య నాలుగు, 12, 19 తేదీల్లో సికింద్రాబాద్-కాకినాడటౌన్-సికింద్రాబాద్ మధ్య నాలుగు, జనవరి 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17, 18 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07033/07034)మధ్య పది రైళ్లు నడుస్తాయి. 8, 9, 10, 11, 12, 13, 14, 15 చర్లపల్లి- కాకినాడ టౌన్-చర్లపల్లి (07031/07032)మధ్య ఎనిమిది, జనవరి 6, 7, 13, 14 తేదీల్లో నాందేడ్-కాకినాడ టౌన్-నాందేడ్ (07487/07488) మధ్య నాలుగు, జనవరి 9, 10, 12, 13, 14, 15 తేదీల్లో చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి (07025/07026) మధ్య ఆరు రైళ్లు అందుబాటులో ఉంటాయి. 7, 8 తేదీల్లో కాచిగూడ-శ్రీకాకుళం రోడ్-కాచిగూడ (07041/07042)మధ్య రెండు రైళ్లు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

హైందవ శంఖారావానికి తరలిన హిందువులు



మార్కాపురం నుంచి శంఖారావానికి తరలివెళుతున్న హిందూ సంఘాల నేతలు

మార్కాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సమీపంలోని కేసరిపల్లిలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావం బహిరంగ సభకు మార్కాపురం పట్టణ, మండల పరిధి నుంచి భారీగా తరలివెళ్లారు. సుమారు 20 బస్సులు, 20 కార్లలో మార్కాపురం నుంచి వేకువజామునే బయలుదేరి వెళ్లారు. బీజేపీ, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, పలు దేవాలయాలకు చెందిన కమిటీల నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావానికి ఎర్రగొండపాలెం నుంచి హిందువులు పెద్దసంఖ్యలో ఆదివారం తరలివెళ్లారు. ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ సెక్రటరీ, ఎన్‌టీఆర్ కళాపరిషత్ చైర్మన్ చీదెళ్ళ నాగేశ్వరరావు, ది జనరల్ మర్చంట్స్ అసోషియేషన్ అధ్యక్షుడు నటుకుల వెంకటనారాయణ తదితరుల ఆధ్వర్యంలో హిందువులు పదులసంఖ్యలో వాహనాల్లో ఈ శంఖారావానికి బయలుదేరారు.

గిద్దలూరు : విజయవాడలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావం బహిరంగ సభకు గిద్దలూరు నియోజకవర్గం నుంచి 40 వాహనాలలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. గిద్దలూరు, రాచర్ల, కంభం, కొమరోలు, బేస్తవారపేట, అర్థవీడు మండలాల నుంచి 40 వాహ నాలలో, 4 బస్సులలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుండి హైందవసభకు వాహనాలు తరలివెళ్లాయి. గిద్దలూరులో అభయాంజనేయస్వామి దేవాలయం నుంచి ఈప్రాంత వాహనాలు ర్యాలీగా వెళ్లాయి. కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు పిడతల సరస్వతి, హిందూ దేవాలయాల కమిటీ అధ్యక్షులు చేరెడ్డి యర్రారెడ్డి, బీజేపీ, విహెచ్‌పి ప్రతినిధులు రాజు, రామిరెడ్డి, మల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, బాదుల్లా, నరసింహులు, తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

పొదిలి : సనాతనధర్మ పరిరక్షణకే హైందవ శంఖారావమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లం కొండ విజయలక్ష్మీ అన్నారు. ఆదివారం విజయవాడలో నిర్వహిస్తున్న శంఖారావ సభకు పట్టణం నుండి పెద్ద సంఖ్యలో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, బీజేపి సభ్యులు బయలుదేరి వెళ్లారు. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, బీజేపి సభ్యులే కాకుండా ధర్మ రక్షణకోసం, దేశభక్తి బావంతో అందరు కలిసిరావాలని కోరారు. ఈ శంఖారావ సభకు బీజేపీ సీనియర్ నాయకులు ముప్పల పార్థసారధి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.



గిద్దలూరు, పొదిలి నుంచి హైందవ శంఖారావానికి తరలి వెళుతున్న హిందువులు

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటిగంగ సన్నిధిలోగల గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లిపై భక్తితో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టి చల్లంగా కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయబ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, దేవదాయశాఖ ఆర్పీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ముండ్లమూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వేంచేసి ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవార్లకు ఆదివారం ప్రత్యేక పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. మండలంలోని భట్లపల్లి, పోలవరం, ముండ్లమూరు, నూజెండ్లపల్లి, బొప్పూడివారిపాలెం, పసుపుగల్లు, కెల్లంపల్లి, ఈదర గ్రామాల్లో పోలేరమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. తమ పిల్లా పాపలను చల్లంగా చూడంటూ వేడుకున్నారు.

9న మెగా క్రికెట్ టోర్నమెంట్

పామూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ బొల్లా మాల్యాద్రి చౌదరి జ్ఞాపకార్థం మండలంలోని గుమ్మలంపాడు గ్రామంలో ఈనెల 9న జీఎంపీ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, యారవ శ్రీనివాసులు, బి.జయరామిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.15,116, తృతీయ బహుమతిగా రూ.10,116 అందజేయనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాల కోసం పి.సంతోష్ 9390008619, మహేంద్ర 9121050047, ఎం.మాధవ్ 8919783759 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రేగులచెలుకలో..

సీఎస్‌పురం(పామూరు), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులచెలుక గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్‌వైసీసీ ఆధ్వర్యంలో ఈనెల 8న టెన్నీస్‌బాల్ మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ తులబందుల వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ.20,116, రెండవ బహుమతి రూ.10,116 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఏడుకొండలు 80743949998, సత్యం 9390122580 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బాధితుడికి సాయం

పామూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్రచేలు కాలనీకి చెందిన షేక్ రహీం బాషా అనారోగ్యంతో మంచానికి పరిమితమయ్యాడు. పూట గడవటమే కష్టంగా ఉందని తెలుసుకొన్న టీడీపీ నాయకుడు యారవ శ్రీను చేతుల మీదుగా ఆదివారం బాధితుడి కుటుంబసభ్యులకు రూ.50 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ ఖాజారహంతుల్లా, షేక్ హాజీగౌస్, ఆర్ఆర్ రఫి, ముబినా మౌలాలి, షేక్ మస్తాన్, పిడుగు శ్రీను, షేక్ సుభాని, గుత్తి మహేస్, వాయినేని రాఘవ పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాలకు తరలివెళ్లిన సభ్యులు

సీఎస్‌పురం(పామూరు) జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఆదివారం నుంచి ఈనెల 8 వరకు జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలకు సీఎస్‌పురం నుంచి తరలివెళ్లారు. యూటీఎఫ్ నాయకులు ఏ.సురేష్, షేక్ పాదుషా, కె.వెంకటరెడ్డి, జె.వెంకట్రావు, ఎం.శ్రీనివాసరాజు, జి.లక్ష్మీనారాయణ, వి.సాంబశివరావు, ఎన్.తిరుపతయ్య, ఎం.కిరణ్‌కుమార్, జి.వెంకటేశ్వర్లు, కె.మహేశ్వరరెడ్డి, తదితరులు వేడుకల్లో పాల్గొనేందుకు కాకినాడకు ఆదివారం తరలివెళ్లారు.

పామూరులో గ్రామోత్సవం

పామూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పామూరు నుంచి పలువురు భక్తులు శబరిమలైకు ఆదివారం ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. ముందుగా దేవస్థానంలో అర్చకులు చిమట పట్టాభిస్వామి పూజలు చేసి ఇరుముడులు కట్టించారు. అనంతరం స్థానిక సత్యదేవుని దేవస్థానం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్‌లు కావిటి సుబ్బయ్య, గుత్తి రాజ, కంభాల రోశయ్య, పోశం నరసింహారావు, ఓగూరి ఏడుకొండలు, రాచూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

22ఏలో చేరిన భూములకు మోక్షం కలిగేనా!

» హక్కుదారుల ఎదురుచూపులు

దర్శి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో 22ఏలో చేరిన పట్టాభూములకు ఈసారైనా మోక్షం కలుగుతుందా అని హక్కుదారులు ఆశతో ఎదురుచూస్తున్నారు. అధికారుల తప్పిదాలతో 2018లో జరిగిన రికార్డుల క్రమబద్ధీకరణలో వందలాది ఎకరాలు పట్టాభూములు 22ఏలో చేరాయి. కొంతమంది అధికారులు కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకోకుండా రికార్డులు సరిగా చూడకుండా ఏకపక్షంగా 22ఏలో చేర్చారు. దీంతో అప్పటినుంచి భూములపై హక్కులు కల్గిన యజమానులు క్రమబద్ధీకరణ కోసం ఏళ్ల తరబడి తిరుగుతున్నారు. కొంతమంది రైతులు వ్యయప్రయాసలతో కొద్దిపాటి భూములను క్రమబద్ధీకరించుకున్నారు. ఇంకా వందలాది భూములు 22ఏ జాబితాలో మిగిలిపోయాయి. హక్కుకలిగిన రైతులు అవసరాలకు విక్రయించుకునేందుకు వీలుపడలేదు. కనీసం వ్యవసాయ రుణాలు కడా పొందేందుకు వీలులేకుండా పోయింది.

తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం 22ఏ జాబితాలో చేరిన భూములకు ఆంక్షలు తొలగిస్తామని స్పష్టం చేయటంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. గత ఏడు సంవత్సరాలుగా రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్‌ల చుట్టూ తిరిగిన రైతులు ఈసారైనా 22ఏ భూములకు మోక్షం కలుగుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా ఉత్తర్వులు ఇచ్చి తమకు హక్కు కలిగిన భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి రికార్డులు క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

నరకప్రాయంగా రహదారులు

» అడుగడుగునా గోతులు.. లేచిపోయిన తారు

» ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



అధ్వానంగా లక్ష్మీనగర్ - ఉల్లగల్లు రహదారి

ముండ్లమూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రహదారులు నరకానికి దారులుగా మారాయి. ప్రధానంగా వేముల - ఉల్లగల్లు, లక్ష్మీనగర్ - పెద ఉల్లగల్లు రోడ్లు దారుణంగా ఉన్నాయి. మోకాలి లోతు గుంతలు పడి కంకర లేచిపోయింది. ఈరహదారులపై ప్రయాణం చేసేవారు పడరాని పాట్లు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన సంబంధిత శాఖ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటంలేదు.

గత వైసీపీ ప్రభుత్వంలో తట్ట మట్టి పోసిన పాపాన పోలేదు. అనేకమంది ఈ రహదారులపై ప్రయాణించి ప్రమాదాలకు గురయ్యారు. వేముల నుంచి పెదఉల్లగల్లు ఐదు కిలోమీటర్ల మార్గంలో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. ఈ రహదారిపై ఈదర, అయోధ్య నగర్, కొమ్మవరం, బొప్పూడివారిపాలెం, వేముల గ్రామాల ప్రజలు నిత్యం దర్శి, ముండ్లమూరు ప్రాంతాలకు వెళ్తుంటారు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డులోని గోతుల్లో వాహనాలు పడి తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో వాహనచోదకులకు భారంగా మారింది. రాత్రుల సమయాల్లో కొత్తగా వెళ్ళే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతులు కనిపించక అందులోపడి ప్రమాదాలకు గురవుతున్నారు.

అలాగే, లక్ష్మీనగర్ - ఉల్లగల్లు వచ్చే మూడు కిలోమీటర్ల రహదారి గోతుల మయమైంది. గత ఐదు సంవత్సరాల్లో ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఆ గోతులు పెద్దవై వాహన చోదకులు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో ఈమార్గంలో వెళ్లడానికి వాహనచోదకులు సాహసించడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులను మరమ్మతులు చేసి తమ ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీలో చేరిన దొనకొండ వైసీపీ సర్పంచ్



సర్పంచ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దొనకొండ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): దొనకొండ మేజర్ పంచాయతీ వైసీపీ సర్పంచ్ కె.గ్రేస్‌రత్నకుమారి తన అనుచరులతో ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు సర్పంచ్ గ్రేస్ రత్నకుమారి, ఆమె కుమారులు సునోద్, నితిన్, జాన్సన్, జి.ఐజక్, దేవయ్య, ఆశీర్వాదం మరికొందరికి పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధిని పూర్తిగా విస్మరించి సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పలువురు టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. సర్పంచ్ గ్రేస్ రత్నకుమారి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో దొనకొండ పంచాయతీ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమని గుర్తించి తాము టీడీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుబ్బారావు, మోడి ఆంజనేయులు, శృంగారపు నాగ సుబ్బారెడ్డి, కుందుర్తి లక్ష్మణ్, షేక్ సుభానీ, కె.రామారావు, మస్తాన్, సయ్యద్ సద్దాం, రాయని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా పాత పథకాల పేర్లే!

» పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు



మారెళ్ళలో రైతు భరోసా కేంద్రం పై మారని పేరు



నూజెండ్లపల్లిలో రైతు భరోసా కేంద్రంపై మారని పేరు

ముండ్లమూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం నిద్రమత్తులోనే ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాల పేర్లు నేటికి అలాగే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రైతు భరసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. మండలంలో 17 కేంద్రాలు ఉన్నాయి. మారెళ్ళ, నూజెండ్లపల్లి, వేముల, జమ్మలమడక, పూరిమెట్ల గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలుగానే ఉన్నాయి. సంబంధిత అధికారులు ఆ కార్యాలయాలను సందర్శిస్తున్నా పేరు మార్చిన దాఖలాలు లేవు.

ఈ కేంద్రాలకు పనులమీద వచ్చే ప్రజలు ఇంకా వైసీపీ ప్రభుత్వం నడుస్తుందా? అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

» ఉత్సాహంగా సమ్మేళనం



దొనకొండ జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు

దొనకొండ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు కాదు.. 39 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకున్నారు. చదువుకునే రోజుల్లో చేసిన అల్లరి, ఆడిన ఆటలు ఓ మధురమైన క్షణాలు. మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. దొనకొండలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివినవారు ఎక్కడెక్కడో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో స్థిరపడ్డారు. ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్న వారి అపూర్వ కలయిక మధుర జ్ఞాపకాలతో పాఠశాల ఆవరణం ఆనంద పరవశంతో నిండింది. 1985-86లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థిని నాగమల్లేశ్వరి పట్టుదలతో నిర్వహించిన గెట్ టు గెదర్ కార్యక్రమంలో దాదాపు 60 మంది పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ కుటుంబసభ్యుల బాగోగులు తెలుసుకుంటూ చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను నెమరేసుకుంటూ పరవశించిపోయారు.

నాటి పాఠశాల పరిస్థితి నేటి పాఠశాల అభివృద్ధిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నాటి పీఈటీ ఉపాధ్యాయుడు పాల్గొని వారి ఆనందంలో పాలుపంచుకున్నారు. ప్రస్తుత హెచ్ఎం రామాంజనేయులు పాఠశాల ఆవరణలో డైనింగ్ హాలు నిర్మాణం నిమిత్తం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన పూర్వ విద్యార్థి ఎం.వెంకటరమణ రూ.25 వేలు ఇస్తానని ప్రకటించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు ఆటపాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

» ఎంఈవో దేవిరెడ్డి రామిరెడ్డి



బహుమతులు అందజేస్తున్న ఎంఈవో దేవిరెడ్డి రామిరెడ్డి

కనిగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరచటం అభినందనీయమని ఎంఈవో దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం కనిగిరిలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు (టాలెంట్ టెస్ట్) నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో కనిగిరి మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు, వెలిగండ్ల, పీసీపల్లి హైస్కూల్‌లకు చెందిన విద్యార్థులు ప్రతిభచూపి బహుమతులు సాధించారు. బహుమతుల ప్రధానోత్సవంలో ఎంఈవో దేవిరెడ్డి మాట్లాడుతూ ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లోని మేథాశక్తిని పెంపొందిస్తాయన్నారు. బీఆర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ చైర్మన్ ఉన్నం బాస్కర్ మాట్లాడుతూ ప్రయివేటు, ప్రభుత్వ అనే తారతమ్యం లేకుండా ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్‌లు షియాజ్, రాంబాబు, బాలభాస్కర్, బి.నరేంద్ర పాల్గొన్నారు.

పీసీపల్లి మండలంలోని ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన గణేష్‌కు రూ.5,116, వెలిగండ్ల హైస్కూల్‌కు చెందిన జాహ్నవి రూ.4,116, కంచర్లవారిపల్లికి చెందిన ఏ.నందిని రూ.3116, ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థిని అబిద్ రూ.2,116, పాతపాడు హైస్కూల్‌కు చెందిన ఓబులు చందు రూ.1,116 నగదు బహుమతులు పొందారు.

భక్తి శ్రద్ధలతో ఆదివారం పూజలు



స్వామివారికి మహానైవేద్యం తెస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో భక్తులు ఆదివారం పూజలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. మహా నైవేద్యం సమర్పించి, గోశాలలో గల గోమాతలకు పసుపు, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్నఆదినారాయణ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



మద్దిపాడులో హాస్టల్‌ను సందర్శిస్తున్న మిశ్రా

ఎస్సీ కాలనీల్లో పర్యటిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..!

» జిల్లాలో ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా పర్యటన

» హాస్టళ్ల సందర్శన.. విద్యార్థులతో ముఖాముఖి

» అభ్యసన సామర్థ్యాల పరీక్ష

ఒంగోలునగరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎస్సీ కాలనీలకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. తొలుత ఒంగోలులోని ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న ఆయన్ను కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్ మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేశారు.

ఈ సందర్భంగా మిశ్రా జిల్లాలోని ఎస్సీల జీవన స్థితిగతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మండల కేంద్రమైన మద్దిపాడులోని ఎస్సీ కాలనీని సందర్శించారు. స్థానికులతో ముఖాముఖి మాట్లాడి వారి జీవన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దిపాడులోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. విద్యా బోధన ఎలా ఉందని విద్యార్థులను ఆరా తీశారు. వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. వారితో పాఠ్యాంశాలను చదివించారు.

అనంతరం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడును సందర్శించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. ప్రతి వీధికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారినుంచి అర్జీలను స్వీకరించారు. చివరిగా ఒంగోలు భాగ్యనగర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఆయన వెంటన డీఆర్వో ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్ తదితరులు ఉన్నారు.

దర్శి అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి



రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్‌తో చర్చిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తిచేసేందుకు నిధులు కేటాయించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు కలిసి విజ్ఞప్తి చేశారు. నర్సరావుపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి అక్కడకు వచ్చారు. ఈసందర్భంగా మంత్రిని కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రారంభించి నిలిచిపోయిన జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ పరిశోధన కేంద్రం పునర్నిర్మాణం పనులు వీలైనంత త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మధ్యలో నిలిచిపోయిన కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, నగర పంచాయతీ కార్యాలయం నిర్మాణాలకు నిధుల విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించినట్టు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.

హైందవ శంఖారావానికి తరలివెళ్లిన కార్యకర్తలు



కనిగిరి నుంచి ప్రత్యేక వాహనంలో తరలివెళ్తున్న హిందువులు

పామూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావం సభకు పామూరు, సీఎస్‌పురం మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో బీజేపీ, వీహెచ్‌పీ సభ్యులు తరలివెళ్లారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య జండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు, సభ్యులు ఉన్నారు.

కురిచేడు: విజయవాడలో విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హైందవ శంఖారావం సభకు కురిచేడు మండలం నుంచి భారీ ఎత్తున తరలివెళ్లారు. హిందూ దేవాలయాలు హిందువుల ఆధ్వర్యంలోనే ఉండాలనే ప్రధాన అజెండాతో ఏర్పాటుచేసిన బహిరంగ సభకు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు.

దొనకొండ: విజయవాడ సమీపంలోని గన్నవరం వద్ద ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావం సభకు స్థానిక ఆనంద ఆశ్రమ ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి ఆధ్వర్యంలో మండలంలోని పలుగ్రామాలకు చెందిన హిందువులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. ఉదయం ఐదు గంటలకు ఆశ్రమం వద్దకు చేరుకొని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సుల్లో విజయవాడకు వెళ్లారు. శంఖారావం కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు అన్నీ సౌకర్యాలు ఏర్పాటుచేసినట్లు భైరవానందస్వామి తెలిపారు.

కనిగిరి: విజయవాడలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావానికి కనిగిరి మండలం నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్ళారు. హైందవ సంఘం నాయకురాలు కనమర్లపూడి లక్ష్మీమోహన్ ఆధ్వర్యంలో వందలాది మంది కనిగిరి నుంచి ప్రత్యేక వాహనాల్లో వెళ్ళారు.

ఈగలపాడును సందర్శించిన డీఎంహెచ్‌వో

పొదిలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పొదిలి మండలం ఈగలపాడును డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు ఆదివారం సందర్శించారు. గ్రామంలో కీళ్ళ నొప్పులు ఉన్నాయనే సమాచారంతో ఉప్పలపాడు, చందలూరు వైద్యాధికారులతో గ్రామాన్ని పరిశీలించారు. ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు.





గుంటూరులో ప్రథమ బహుమతి పొందిన చౌడం విజయలక్ష్మికి రూ.6వేల నగదు అందజేస్తున్న టీడీపీ సీనియర్ నేత కుర్రా అప్పారావు, ఆంధ్రజ్యోతి డీజీఎం సూదా రామచంద్రరావు



తెనాలిలో ప్రథమ బహుమతి పొందిన కే మానసకు రూ.6 వేలు అందజేస్తున్న మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్ సాంబశివరావు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, కొడాలి వీరయ్య ట్రస్ట్ కన్వీనర్ వాసిరెడ్డి ప్రియబాంధవి



నరసరావుపేటలో ప్రథమ బహుమతి పొందిన కుమ్మరి చందనకు రూ.6 వేల నగదు అందజేస్తున్న శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ దంపతులు



గుంటూరులో ప్రథమ బహుమతి సాధించిన చౌడం విజయలక్ష్మి వేసిన ముగ్గు



తెనాలిలో ప్రథమ బహుమతి పొందిన కే మానస వేసిన ముగ్గు



నరసరావుపేటలో ప్రథమ బహుమతి పొందిన కుమ్మరి చందన వేసిన ముగ్గు

ముగ్గులు మురిశాయి

- ఆంధ్రజ్యోతి ముగ్గులతో ఇలపై ఇంద్రధనుస్సు
- రంగవల్లులతో రంగులమయమైన ప్రాంగణాలు
- ముందుగానే సంక్రాంతి వచ్చేసిందన్నట్లుగా సందడి
- గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో పోటీలు
- చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్దసంఖ్యలో హాజరు

రంగు రంగుల రంగవల్లులతో భూమాత పులకరించగా.. ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలతో ఇలపై ఇంద్రధనుస్సు ఆవిష్కృతమైంది. గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో పోటీలు జరగ్గా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు తీర్చిదిద్దిన ముగ్గులు మురిశాయి. ముందుగానే సంక్రాంతి వచ్చేసిందన్నట్లుగా ఆయా ప్రాంగణాల్లో సందడి నెలకొంది. గుంటూరులో పోటీలకు 220 మంది, తెనాలిలో 142 మంది, నరసరావుపేటలో 110 మంది వరకు హాజరై తమ ముగ్గు నైపుణ్యాన్ని ప్రదర్శించారు. సంప్రదాయ రీతిలో గొబ్బెమ్మలు.. గంగిరెద్దులు, నవధాన్యాలు, చెరుకుగడలు, పాలపొంగులు, హరిదాసులు, రైతుల బొమ్మలు, పూలతో అలంకరించిన ముగ్గులు చూపురులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సారి విద్యార్థినులు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా.. ఈ పోటీలతో మనదైన సంస్కృతి, సంప్రదాయాన్ని ఒక తరం నుంచి మరో తరం అందిపుచ్చుకునేలా ఆంధ్రజ్యోతి ఈ కార్యక్రమం నిర్వహించిందని అతిథులు, హాజరైన వారు అభిప్రాయపడ్డారు.

గుంటూరు(విద్య), తెనాలి అర్బన్, నరసరావుపేట కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముగ్గులను తీర్చిదిద్దేందుకు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా ముందుకు రావడంతో ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన కనిపించింది. గుంటూరు, తెనాలి, నరసరావుపేటల్లో పోటీలు జరిగ్గా ఆయా ప్రాంతాల్లో సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం నెలకొంది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు గుంటూరులో టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు, తెనాలిలో గణేష్ యూత్ అంగలకుదురు, నరసరావుపేటలో మాజీ మున్సిపల్ చైర్మన్, శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయగుప్తా స్పాన్సర్లుగా వ్యవహరించారు. పోటీలు గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో జరిగినా చుట్టుపక్కల గ్రామాలతో పాటు సమీప జిల్లాలకు చెందిన వారు కూడా పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మంచు, చలిగాలులను సైతం లెక్క చేయకుండా పదుల కిలోమీటర్ల దూరం నుంచి మహిళలు ఉదయం 9 గంటలకే ఆయా కేంద్రాలకు చేరుకుని ఉత్సాహంగా ముగ్గులను తీర్చిదిద్దారు. ముగ్గులను తిలకించేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వివిధ కళాశాలల విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులపై మక్కువ చూపారు. సంప్రదాయాలను మేళవిస్తూ.. వినూత్నంగా.. విభిన్నంగా.. సందేశాత్మకంగా మహిళలు ముగ్గులను తీర్చిదిద్దడంతో విజేతల ఎంపికకు న్యాయనిర్ణేతలు శ్రమపడాల్సి వచ్చింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల నగదుతో పాటు కన్సొలేషన్ బహుమతు లతో పాటు పాల్గొన్న వారందరికీ ప్రత్యేక గిఫ్టులను గుంటూరులో కుర్రా అప్పారావు, తెనాలిలో గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, నరసరావుపేటలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, అనురాధగుప్తాలు అందజేశారు. గుంటూరులో ఒకవైపు మహిళలు ముగ్గులు తీర్చిదిద్దుతూ తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు పోటీపడగా వారి పిల్లలు, మరికొందరు మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.



మహిళా నైపుణ్యాలకు ముగ్గులు దర్పణం : కుర్రా అప్పారావు

గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు మాట్లాడుతూ మహిళల్లోని నైపుణ్యాలకు ముగ్గులు దర్పణంగా నిలిచాయని ప్రశంసించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో తెలుగు లోగిళ్లలో పెద్ద పండుగైన సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా ముగ్గులు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రోత్సహించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.

ముగ్గులతో ఆరోగ్యం : వీరవల్లి మురళి

తెనాలి బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పోటీ ఉత్సాహ పూరిత వాతావరణం లో జరిగింది. పోటాపోటీగా మహిళ లు ముగ్గులు తీర్చిదిద్దడంతో నగదు బహుమతులతో పాటు ప్రత్యేకంగా పట్టుచీరలు అందజేశారు.

విజేతలు

గుంటూరు

1. సీహెచ్ విజయలక్ష్మి
2. పీ.పూజిత
3. కే.చందన

కన్సొలేషన్: సునీత, శ్రీలత, మాధవీలత, గీజాంజలి, మాధవి

తెనాలి

1. కే.మానస
2. ఎస్.లక్ష్మీతిరుపతమ్మ
3. పీ.సాయిచైతన్య

నరసరావుపేట

1. కుమ్మరి చందన
2. ఏ.నాగజ్యోతి
3. పాపన సుజాత

కన్సొలేషన్ : మచ్చా మాధవి, బాపతు లావణ్య, గ్రంధి సురేఖ, మట్రం లక్ష్మీతిరుపతమ్మ



తెనాలి : బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



గుంటూరు : ఎన్టీఆర్ స్టేడియంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



నరసరావుపేట : ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రాంగణంలో ముగ్గులను తీర్చిదిద్దుతున్న మహిళలు

బాపట్లలో నేడు ముగ్గుల పోటీ

- మున్సిపల్ హైస్కూల్ వెనుక రోడ్డులో ఏర్పాట్లు
- పోటీలను ప్రారంభించనున్న కలెక్టర్ వెంకటమురళి

(బాపట్ల - ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో బాపట్లలో సోమవారం ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో కర్లపాలెం మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు, జీఎస్ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ ఆధ్వర్యంలో బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వెనుక ఉన్న రోడ్డులో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. పోటీలను కలెక్టర్ వెంకటమురళి ప్రారంభించనున్నారు. పేర్లు నమోదు చేసుకున్న మహిళలు ఉదయం 8 గంటలలకు పోటీల ప్రాంగణానికి చేరుకోవాలని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు అందచేస్తామని తెలిపారు. ముందస్తుగా ఫోన్లో పేర్లు నమోదు చేసుకోని వారు కూడా నిర్ణీత సమయంలో ప్రాంగణానికి వచ్చి పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీల్లో మహిళలు, యువతులే పాల్గొనాలని, చుక్కల ముగ్గులు మాత్రమే వేయాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అవసమైన ముగ్గులు, రంగులు, ఇతర సామగ్రి పోటీదారులే తెచ్చుకోవాలన్నారు.



పోటీలు జరిగే ప్రాంగణంలో సిద్ధమైన వేదిక

ఒక్క రోజు తనిఖీలతో.. రూ.26.32 లక్షలు

- వాణిజ్య పన్నులశాఖకు స్వేచ్ఛ ఇస్తే ఇంకెంత ఆదాయమో?
- గ్రానైట్ అక్రమ రవాణాను అడ్డుకుంటే నెలకు రూ.కోట్లలో రాబడి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఒక్కరోజు తనిఖీలతో రూ.26.32లక్షల ఆదాయం. ఇదే రోజువారీగా చేస్తే.. అలా చేసేందుకు అధికారులు స్వేచ్ఛ ఇస్తే ప్రభుత్వ ఆదాయం రూ.కోట్లలో ఉంటుందా అంటే శనివారం నరసరావుపేటలో చోటుచేసుకున్న పరిణామాలు చూస్తే అవునంటున్నాయి. పల్నాడు జిల్లా నుంచి గ్రానైట్ అక్రమ రవాణా పెద్దఎత్తున జరుగుతుండగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం అధికార పార్టీ నేతల జేబుల్లోకి వెళుతుంది. ఎటువంటి పన్నులు చెల్లించకుండానే ప్రతి నెల వందలాది లారీల గ్రానైట్ జిల్లా గుండా ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. శనివారం జిల్లాలో విస్తృతంగా వాణిజ్య పన్నులశాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో గ్రానైట్ అక్రమ రవాణా గుట్టురట్టయింది. ఇతర రాష్ట్రాలను గ్రానైట్ రవాణా చేస్తున్న 14 లారీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్క లారీ నిర్వాహకుడి నుంచి రూ.80 వేలు జరిమానా, అలాగే పన్నురూపంలో మరో రూ.15.12 లక్షలు, వెరసి రూ 26.32లక్షలు వసూలు చేశారు. ఈ లారీలు బాపట్ల జిల్లా మార్టూరు, బల్లికురవ గ్రానైట్ కంపెనీల నుంచి వచ్చినట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. పన్నులు చెల్లించకుండా మహారాష్ట్రకు తరలిపోతున్నాయని అధికారులు తెలిపారు.

మిన్నకున్న మైనింగ్ శాఖ

వాణిజ్య పన్నుల శాఖ అధికారులు లారీలను స్వాధీనం చేసుకున్న సమాచారాన్ని మైనింగ్‌శాఖకు తెలిపారు. లారీల్లోని గ్రానైట్‌కు రాయల్టీ చెల్లించారా లేదా అన్న అంశాన్ని మైనింగ్ శాఖ పరిశీలించాలి. లారీల్లో గ్రానైట్ కొలతలు తీసి రాయల్టీ వసూలు చేయాలి. అయితే సదరు అధికారులు ఆదివారం వరకు కూడా చర్యలు తీసుకోకుండా మిన్నకున్నారు. లారీల్లోని గ్రానైట్ పరిశీలనకే మైనింగ్ శాఖ అధికారులు పరిమితమయ్యారు. కొలతలు తీసి రాయల్టీ వసూలు చేసే ప్రయత్నం చేయకపోవడంతో విమర్శలకు దారితీసింది.

అధికారులపై ఒత్తిళ్లు

వాణిజ్య పన్నుల శాఖ స్వాధీనం చేసుకున్న లారీలను వదిలేయాలని కొందరు నేతలు అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెచ్చినట్టు సమాచారం. జాయింట్ కమిషనర్ ఆదేశాలతో తనిఖీలు నిర్వహించిన అధికారులు నేతల ఒత్తిళ్లకు తలొగ్గకుండా జరిమానాలు విధించారు. గ్రానైట్ అక్రమ రవాణాకు సహకరిస్తూ కొందరు నేతలు నెలకు రూ.లక్షల్లో ఆదాయాన్ని పొందుతున్నారనే ఆరోపణలున్నాయి.

రోజూ 60 లారీల్లో గ్రానైట్ అక్రమ రవాణా

పల్నాడు జిల్లా నుంచి గ్రానైట్ అక్రమ రవాణా పెద్దఎత్తున జరుగుతోంది. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పక్కదారి పడుతోంది. ఎటువంటి పన్నులు చెల్లించకుండానే నిత్యం 50 నుంచి 60 లారీల గ్రానైట్ తెలంగాణ, మహరాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు తరలిపోతోంది. ఏటా రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నట్లు సమాచారం. ఇంత పెద్దఎత్తున అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు కార్యాలయాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి ఉంది. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు రోడ్డుపైకి వచ్చి తనిఖీలు చేసే స్వేచ్ఛలేదు. ఈ క్రమంలో ప్రభుత్వానికి గ్రానైట్ పన్ను ఆదాయం 90 శాతానికి పైగా తగ్గిందని ఓ అధికారి తెలిపారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కోటప్పకొండ మీదగా నరసరావుపేట బైపాస్ రోడ్డుకు రాత్రి వేళ గ్రానైట్ లారీలు చేరుకుంటాయి. అక్కడ నుంచి లారీలను రాష్ట్ర సరిహద్దులు దాటించే ముఠా రంగంలోకి దిగి డ్రైవర్లకు టోకెన్లు ఇస్తారు. టోకెన్ ఉన్న లారీని ఎక్కడా ఎవరూ ఆపరని ఎవరైనా ఆపితే తాము చూసుకుంటామని సదరు ముఠా భరోసా ఇస్తుంది. ఏ అధికారైనా టోకెన్ ఉన్న లారీని ఆపితే సదరు ముఠా రంగంలోకి దిగి సురక్షితంగా రాష్ట్ర సరిహద్దు దాటిస్తోంది. గ్రానైట్ అక్రమ రవాణా వైపు కన్నెత్తి చూసే పరిస్థితులు ఇక్కడి అధికారులకు లేదంటే అక్రమ దందాకు ఏ స్థాయిలో నేతల అండదండలు ఉన్నాయో తెలుసు కోవచ్చు.



జొన్నవిత్తులకు పురస్కారాన్ని అందజేస్తున్న ట్రస్ట్ సభ్యుడు శ్రీరామచంద్రమూర్తి, తదితరులు

విలక్షణ కవి.. జొన్నవిత్తుల

- సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభలో వక్తలు

అద్దంకిటౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య రంగంలో విలక్షణ కవిగా పేరు తెచ్చుకున్న కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జొన్నవిత్తులకు సాహిత్య పురస్కార ప్రధానోత్సవ సభ నారాయణం బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొని జొన్నవిత్తుల కవితా మహోన్నతిని కొనియాడారు. ఈ సందర్భంగా పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ, చక్రధర్, తాండవకృష్ణలు జొన్నవిత్తులకు పురస్కారాన్ని అందజేశారు. సన్మానగ్రహీత జొన్నవిత్తల మాట్లాడుతూ శతక సాహిత్యం చదవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం, సదాచర భావన కలిగి, సమైక్య భావన పెంపొందుతుందన్నారు. సాహిత్య మాధ్యమం ద్వారా తెలుగు భాషపై ప్రేమ పెంపొందించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అద్దంకి గొప్పతనాన్ని వర్ణిస్తూ గేయాత్మకంగా పద్యం రాసి సభలో విన్పించారు. అనంతరం జొన్నవిత్తుల ఆయన సతీమణి వీరశేషకుమారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం, పాలపర్తి శ్యామలానంద, రఘురామశర్మ, ప్రముఖ సాహితీవేత పొలూరి వెంకట శివరామప్రసాద్, డీవీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం వైపు మార్టూరు పంచాయతీ

- విలేజ్ గ్రోత్ సెంటర్ల పథకం కింద అభివృద్ధి
- జిల్లా అధికారులకు మూడు ప్రతిపాదనలు

మార్టూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయం పెరిగేలా పంచాయతీ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి జిల్లా పంచాయతీ అధికారులకు పంపినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రస్తుతం ఉన్న ఆదాయం కన్నా అదనపు ఆదాయం పెరగడానికి విలేజ్ గ్రోత్ సెంటర్లు అనే పథకానికి రూపకల్పన చేసింది. అందుకు సంబంధించిన వివరాలను రాష్ట్రం నుంచి మండలాల్లోని గ్రామ పంచాయతీలకు వచ్చినట్లు తెలిసింది. గ్రామ పంచాయతీలలో విలువైన పంచాయతీ స్థలాల్లో ఏదైనా భవనా నిర్మాణాలు,షాపులు, కల్యాణ మండపాలు, ఇతర వసతులు ఏవైనా నిర్మించి వాటిని ప్రైవేటు వ్యక్తులకు అద్దెలకు ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకునేలా పథకాన్ని రూపొందించారు. అన్ని గ్రామ పంచాయతీలలో ఇలాంటి అవకాశాలు లేక పోయినా మేజరు గ్రామ పంచాయతీ మార్టూరు పంచాయతీ నుంచి మూడు ప్రతిపాదనలను తయారు చేసినట్లు తెలిసింది. గ్రానైట్ పరిశ్రమల పరంగా అభివృద్ధి చెందిన మార్టూరు గ్రామం మీదుగా చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి వెళ్లడం, ఇతరత్రా కారణాలు వల్ల గ్రామంలోని ఖాళీ స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో మండల కాంపెక్స్ వద్ద, ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో ఉన్న పంచాయతీకి చెందిన సుమారు 20 సెంట్ల స్థలంలో పెట్రోలు బంకు నిర్మాణం చేపట్టి, దానిని ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇస్తే పంచాయతీకి ఆదాయం పెరుగుతుందని, అందుకు రూ.కోటి మంజూరు చేయాలని మార్టూరు పంచాయతీ అధికారులు జిల్లా పంచాయతీ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. అలాగే బలరాం కాలనీ సమీపంలో రెండో ప్రతిపాదనగా చెరువు సమీపంలోని 4 సెంట్ల పంచాయతీ స్థలంలో షాపుల నిర్మాణం కోసం కూడా రూ.25 లక్షలు నిధులు మంజూరు చేయాలని, ఈ స్థలం సమీపంలో దాదాపు 40 సెంట్లకు పైగా ఉన్న పంచాయతీ స్థలంలో కల్యాణ మండపం నిర్మించడం కోసం రూ.కోటి నిధులు మంజూరు చేయాల్సిందిగా మూడో ప్రతిపాదన తయారు చేసినట్లు తెలిసింది. ఈ మూడు ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ లభిస్తే మార్టూరు పంచాయతీకి అదనపు ఆదాయంతోపాటు పట్టణం అభివృద్ధి చెందుతుంది. దాదాపుగా మండలంలోని మార్టూరు పంచాయతీ నుంచి మాత్రమే ఈ ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిసింది.



మార్టూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

జిల్లా పంచాయతీ అధికారికి ప్రతిపాదనలు పంపాం



మార్టూరు పంచాయతీ నుంచి మూడు ప్రతిపాదనలు తయారు చేశాం. వాటికి నిధులు మంజూరైతే పంచాయతీ స్థలాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపడతాం. తద్వారా గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుంది. ఈ మూడు ప్రతిపాదనలను జిల్లా పంచాయతీ అధికారికి పంపించాం.

- శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో, మార్టూరు


పంగులూరు ఉన్నత పాఠశాలలో విద్యోన్నతి ఫౌండేషన్ నిర్వహించిన పోటీ పరీక్షకు హాజరైన విద్యార్థులు

విద్యోన్నతి ఫౌండేషన్ పోటీ పరీక్షకు స్పందన

103 మంది విద్యార్థులు హాజరు

పంగులూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యోన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 103 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీ పరీక్షకు పంగులూరు మండల పరిధిలో ఆరు ఉన్నత పాఠశాలలకు చెందిన 110 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ పరీక్షలో ప్రతిభ చాటిన ఐదుగురు విద్యార్థులకు విద్యోన్నతి ఫౌండేషన్ వారు ఇంటర్ లేదా తత్సమాన కోర్సు చదివేందుకు ఒకొక్కరికీ రెండు సంవత్సరాల పాటు ఏడాదికి రూ.10వేల వంతున ఆర్థిక సాయాన్ని అందించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఏకకాలంలో అద్దంకి, పంగులూరు, ఇంకొల్లు మండల కేంద్రాలలో ఆయా మండలాల పరిధిలోని విద్యా ర్థులకు ఈ పరీక్ష నిర్వహించినట్లు ఫౌండేషన్ డైరక్టర్ జయశంకర్ తెలిపారు. స్థానిక ఉపాధ్యాయుల సహకారంతో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వీరాంజనేయులు, జయశంకర్ పర్యవేక్షణలో పంగులూరు కేంద్రంలో ఈ పరీక్షను నిర్వహించారు.

ఇంకొల్లులో 68మంది హాజరు

ఇంకొల్లు : మండలంలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యోన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 73 మంది పేర్లు నమోదు చేసుకోగా, 68 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పర్యవేక్షకులు కరి కమలేశ్వరరావు తెలిపారు. పరీక్షలో మెరిట్ పొందిన విద్యార్థులు ఇంటర్ చదువుకు ఆర్థిక సాయం అందజేస్తామని ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ తెలిపారు. ఇన్విజిలేటర్లుగా గోరంట్ల హరిబాబు, జాగర్లమూడి ప్రభాకరరావు వ్యవహరించారు.

నిలువెత్తు నిర్లక్ష్యం

ఎంపీడీవో కార్యాలయం భవనానికి ముప్పు

అద్దంకి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ఎంపీడీవో కార్యాలయం భవనం నిర్వహణలో నిలువెత్తు నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఎంపీడీవో కార్యాలయం భవనం రెండు అంతస్తులతో సుమారు 15 సంవత్సరాల కిందట నిర్మించారు. భవనంపైన మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. దీంతో భవనం బీటలు వారే ప్రమాదం ఉంది. చిన్న మొక్కలు గా ఉన్నప్పుడు తొలగించకపోతే మానులుగా మారిన తరువాత తొలగించడం కష్టంగా మారుతుంది. ఇప్పటికైనా మండల పరిషత్ అధికారులు స్పందించి భవనం దెబ్బతినక ముందే మొక్కలు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.


అద్దంకి ఎంపీడీవో కార్యాలయంపై పెరిగిన మొక్కలు

మద్యం దుకాణాలా..బార్‌లా?

- నిబంధనలకు పాతర
- పట్టించుకోని అధికారులు

చీరాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పలు మద్యం దుకాణాల నిర్వాహకులు వైన్ షాపుల వద్ద అనధికారిక పర్మిట్ రూములను ఏర్పాటు చేశారు. ఆయా దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసిన వ్యక్తులు దుకాణ నిర్వాహకులు ఏర్పాటు చేసిన రూములలో మద్యం సేవిస్తున్నారు. ఇది అందరికీ కనిపిస్తున్న బహిరంగ రహస్యం. అయితే ఎక్సైజ్ అధికారులకు మాత్రం కనిపించడం లేదు. మద్యం దుకాణాల నిర్వాహకులు అందించే మామూళ్ల మత్తులో ఆ అధికారులకు సిట్టింగ్ రూములు కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మద్యం దుకాణాలా.. లేక బార్‌లా అని ప్రశ్నిస్తున్నారు. చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 24 మద్యం దుకాణాలు ఉన్నాయి. సుమారు 18 మద్యం దుకాణాలకు సంబంధించి అనధికారికంగా ఆయా దుకాణాల వద్ద సిట్టింగ్ రూములు ఏర్పాటు చేశారు. దీంతో కొన్ని చోట్ల గలాటాలు కూడా జరుగుతున్నాయి. వీటిపై ఎక్సైజ్, లా అండ్ ఆర్డర్ పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టపోవడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా వుంటే కొన్ని మద్యం దుకాణాల వద్ద అవసరమైతే అనధికారిక సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసుకోండి, మామూళ్లు మాకు ఇవ్వండని కొందరు అధికారులు ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే పంథాలో ఆ దందా సాగితే ప్రభుత్వానికి అపప్రద రాక తప్పదని చెప్పడంలో సందేహం లేదు.


ఈపురుపాలెంలో మద్యం దుకాణం వెనుక ఏర్పాటు చేసిన రూమ్‌లో తాగుతున్న దృశ్యం


వేటపాలెంలో వైన్ షాపు వద్ద ఏర్పాటు చేసిన రూంలో మద్యం సేవిస్తున్న మందుబాబులు

ఐక్యంగా సమస్యలను పరిష్కరించుకుందాం

- ప్రభుత్వ చేయూతను అందిపుచ్చుకుందాం
- రొయ్యరైతుల సంక్షేమ సంఘ ప్రతినిధుల ఉద్ఘాటన
- వచ్చే ఆదివారం మరలా సమావేశమవుదామని తీర్మానం

వేటపాలెం(చీరాల), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా సాగుచేసే రైతులు అందరం ఐక్యంగా ఉందాం.. సమస్యలను పరిష్కరించుకుందాం.. ప్రభుత్వ చేయూతను అందిపుచ్చుకొని అందుకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుని అడుగులు వేద్దామని కుందేరు, స్ట్రయిట్ కట్ రొయ్య రైతుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఉద్ఘాటించారు. స్థానిక కుందేరు స్ట్రయిట్ కట్ సమీపంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం రొయ్య రైతుల సంక్షేమ సంఘం ప్రతనిధులు, సభ్యుల సమావేశం జరిగింది. సంఘ అధ్యక్షుడు తేళ్ల రామయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, సంఘ కార్యదర్శి ఆమంచి శ్రీనివాసరావు (స్వాములు) తదితరులు మాట్లాడుతూ సంఘ పరిధిలో సుమారు 1700 ఎకరాల విస్తీర్ణంలో రొయ్యల సాగు జరుగుతోందన్నారు. ఆ క్రమంలో రొంపేరు పూడిక తీత పనులు, ప్రస్తుతం సాగులో ఉన్న విస్తీర్ణం, పూడిక తీత నేపథ్యంలో సాగులో ఏర్పడే అంతరాలు, అందుకు సాగుదారులు సహకరించాల్సిన బాధ్యతలు, ప్రభుత్వ పరంగా సమకూరాల్సిన వనరులు, చేయూత గతం, వర్తమానం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. దీర్ఘకాలంగా జరుగుతున్న సాగు, స్వీయ అనుభవాలు, ఎదురైన సవాళ్లు, సానుకూల, ప్రతికూల పరిస్థితులను విశ్లేషించారు. క్రీక్‌లలో పూడిక తీత, తరువాత పూడికలు ఏర్పడకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేకంగా చర్చించారు. ప్రభుత్వ పరంగా అందే రాయితీలు, ఎన్ని ఎకరాలలోపు రైతులుకు ఏఏ రాయితీలు ఉంటాయనే అంశంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. చెరువుల యజమానులు, కౌలుదారుల మధ్య ఉండాల్సిన అవగాహనపై ప్రత్యేకంగా చర్చించారు. అర ఎకరం చెరువు ఉన్న రైతు అభిప్రాయాన్ని కూడా పరిగణలోకి తీసుకుందామన్నారు. యజమాని బాగుంటేనే కౌలుదారు బాగుంటాడని, అందుకు పలు ఉదాహరణలను పేర్కొన్నారు. వచ్చే ఆదివారం తిరిగి సమావేశమై పూర్తి స్థాయిలో ఆక్వా చెరువుల యజమానులు హాజరయ్యే విధంగా కార్యాచరణ రూపకల్పనకు దిశానిర్దేశం చేశారు. నిర్దిష్టమైన నిర్ణయాలు తీసుకుని వాటి అమలుకు అడుగులు వేద్దామని తీర్మానించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పల్లపోలు శ్రీనివాసరావు, భాస్కరరెడ్డి, చెరువుల యజమానులు, పలువురు కౌలుదారులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మార్టూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కమిటీ అధ్వర్యంలో సోమవారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సభ్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత సేవలు అందిస్తారని తెలిపారు. ఆరోగ్య శ్రీ కార్డులతో శిబిరానికి రావాలని సూచించారు.

13న ద్రోణాదులలో షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు

మార్టూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో ఈ నెల 13వ తేదీన ఇండోర్ ప్రాంతీయ షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలను (నాన్‌మెడలిస్ట్) ప్రారంభించనున్నట్లు గ్రామ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నామని, 45 ఏళ్లలోపు, 45 ఏళ్ల పైబడిన వారు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ప్రతి విభాగంలో మొదటి, రెండవ, మూడవ బహుమతులుగా రూ.8001, రూ.5001 రూ.3001 అందజేస్తారని ప్రకటించారు. ఈ పోటీలకు మార్టూరు, అద్దంకి, కొరిశపాడు, జె పంగులూ రు, యద్దనపూడి, ఇంకొల్లు, పర్చూరు, కారంచేడు, చీరాల, వేటపాలెం మండలాలవారు పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 9959576009, 9959900747 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ప్రమాదకరంగా బ్రిడ్జిలు

- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో ప్రయాణికులు

చీరాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : 216 జాతీయ రహదారిపై పలు చోట్ల బ్రిడ్జిల వద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆయా ప్రదేశాల్లో సీసీ రోడ్డులో ఇనుప చువ్వలు వెలుపలకి వచ్చాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా సంబంధిత 216 జాతీయ రహదారి పర్యవేక్షణ కాంట్రాక్ట్ బృందం ఆవైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ప్రధానంగా చీరాల మండలం ఈపురుపాలెం బ్రిడ్జి పైన, చినగంజాం మండలం బ్రిడ్జి పైన ఏర్పడిన గోతులు, వెలుపలకు వచ్చిన ఇనుప చువ్వలతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆయా గుంతల వద్ద పక్క నుంచి వెళ్లే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక ఆయా చువ్వలు బయటపడ్డ ప్రదేశాల్లో బైక్‌లపై రాకపోకలు సాగించే వ్యక్తులు పలు సందర్భాల్లో సదరు బ్రిడ్జిల పైన వెలుపలకు వచ్చిన ఇనుక సువ్వలపై ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఈపురుపాలెం బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి వెలుపలకు వచ్చిన ఇనుప చువ్వలు


అలవలపాడు రోడ్డుపై పారుతున్న మురుగు

రోడ్లపై మురుగు

- గ్రామాల్లో లేని కాలువలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

పంగులూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. మురుగు కాలువల లేకే ఈ పరిస్థితి ఏర్పడిందని, దీంతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలవలపాడు, ముప్పవరం గ్రామాలలో ఆర్‌అండ్‌బీ నిర్మించిన ప్రధాన సీసీ రోడ్లపై మురుగు నీరు నిలిచి ఉంటోంది. అలవలపాడు గ్రామంలో ప్రధాన కూడలి నుంచి తక్కెళ్లపాడు వైపు వెళ్లే సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ లేని కారణంగా పలు చోట్ల నివాసాల నుంచి వచ్చే మురుగు నీరు పలు చోట్ల రోడ్డెక్కుతుంది. ముప్పవరం ప్రధాన రహదారిలో పశు వైద్యశాల సమీపంలో మురుగు నీరు ముందుకు పోక రోడ్డుపైకి ఎగబాకుతున్న పరిస్థితి. ప్రధాన రహదారులలో సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో ఆర్ అండ్ బీ అధికారులు డ్రైనేజీ నిర్మాణంపై దృష్టి సారించకపోవడంతో పలు చోట్ల ఈ పరిస్థితి ఏర్పడింది. నిత్యం వాహన రద్దీ ఉండే ప్రధాన రహదారులలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళ మృతదేహం గుర్తింపు

అద్దంకి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాయపాలెంలకు చెందిన కొల్లారి హనుమాయమ్మ (42) మృతదేహాన్ని గుండ్లకమ్మ నదిలో గుర్తించారు. హనుమాయమ్మ గత శనివారం రాత్రి బ్రిడ్జిపై నుంచి గుండ్లకమ్మ నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. వారంరోజుల పాటు మృతదేహం కోసం పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది గాలించారు. ఎట్టకేలకు శనివారం రాత్రి మోదేపల్లి సమీపంలో మృతదేహాన్ని గుర్తించారు. ఆదివారం హనుమాయమ్మ మృతదేహానికి తిమ్మాయపాలెం అంత్యక్రియలు నిర్వహించారు.

గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్న లారీల పట్టివేత


మార్టూరు స్టేషన్‌కు తరలించిన గ్రానైట్ శ్లాబుల లారీలు

మార్టూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి బిల్లులు లేకుండా మార్టూరు నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న రెండు గ్రానైట్ శ్లాబుల లారీలను శనివారం రాత్రి మార్టూరులో విజిలెన్సు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని స్టేషన్‌కు తరలించారు. వాటిపై కేసు నమోదు చేశారు.

గడ్డివామి దగ్ధం

మేదరమెట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావినూతల గ్రామంలో ఆదివారం మూడు ట్రక్కుల గడ్డివామి దగ్ధమైంది. పులిపర్తి చిన్నాకు చెందిన మూడు ట్రక్కుల వరిగడ్డికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో అద్దంకి నుంచి వచ్చిన అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇంచుమించు రూ.60వేల నష్టం జరిగినట్లు బాధిత రైతు వాపోయారు. పాడిపశువులు, వ్యవసాయం కోసం గడ్డి నిల్వ చేయగా దగ్ధమైందన్నారు. ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరుతున్నారు.

గేట్ సెంటర్.. పద్మవ్యూహం


- నిత్యం ట్రాఫిక్ సమస్య
- నరకం చూస్తున్న ప్రయాణికులు


కారంచేడు గేటు సెంటర్‌లో ఉన్న ట్రాఫిక్

చీరాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గేటు సెంటర్ ప్రతి రోజూ ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ప్రధానంగా రైళ్ల రాకపోకల సమయంలో గేటు వేసి ఉన్న సందర్భాల్లో ఆ పరిస్థితి మరింత జఠిలంగా ఉంటోంది. ఆదివారం రోజులలో కూడలికి ఇరు వైపులా ఉన్న మాంసం దుకాణాలు, చేపల విక్రయాలతో కొనుగోలుదారుల రద్దీ మరీ ఎక్కువగా ఉంటోంది. ఆయా సమయాల్లో రైళ్ల రాకపోకలకు సంబంధించి గేటు వేసిన సమయాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతుండడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. దీంతో చిన్న, చిన్న ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వాటిలో కొన్ని వాదనలకు పరిమితం అవుతుండగా, మరికొన్ని బల నిరూపణకు దారతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీస్‌ను ఏర్పాటు చేయడం ఎంతైనా అవసరమని ప్రజలు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా ఆ ప్రాంత పరిధిలోని పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వాహనాలతో రద్దీగా ఉన్న కారంచేడు గేటు సెంటర్

సోమశిలకు 2,194 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 2,194 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 71.622 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,050, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని వారు తెలిపారు.

చుక్కలు మురిసె.. అవని మెరిసె..

నెల్లూరు, కావలి, గూడూరులో నిర్వహణ

తరలివచ్చిన నారీలోకం

విజేతలకు బహుమతుల అందజేత

ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలతో ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంక్రాంతి శోభ వచ్చింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్-ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సేల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) నిర్వహించిన ఈ పోటీలకు నెల్లూరు, కావలి, గూడూరు పట్టణాల్లో భారీగా మహిళలు పాల్గొన్నారు. అందమైన రంగవల్లులతో మైదానాలకు సంక్రాంతి పూలు పూయించారు. తెలుగు జాతి సంస్కృతి సంప్రదాయలను ఇనుమడింప జేసేలా అందమైన ముగ్గులు తీర్చిదిద్దడానికి ఒకరితో ఒకరు పోటీ పడ్డారు. 11 ఏళ్ల బాలికల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు నారీమణులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జరిగిన పోటీలకు నెల్లూరులోని సీఎంఆర్ షాపింగ్ మాల్ లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరించారు. ప్రతి కేంద్రంలో ప్రథమ విజేతలకు పట్టు చీర, ద్వితీయ విజేతకు వర్క్ శారీ, తృతీయ విజేతకు డిజైనర్ శారీలతోపాటు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. విజేతలతోపాటు పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : వీఆర్ కళాశాల మైదానంలో జరిగిన పోటీలకు నారీమణులు భారీగా తరలివచ్చారు. బాలికలతోపాటు ముస్లిం మహిళలు కూడా ఈ పోటీల్లో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలు పి.నాగేశ్వరమ్మ, డాక్టర్ ప్రసన్న పూర్ణ, సబ్‌రిజిస్ట్రార్ ప్రసన్నలక్ష్మీ క్షుణ్ణంగా పరిశీలించి, విజేతలను ఎంపిక చేశారు. నవాబ్ పేటకు చెందిన దేవరపల్లి ఉష ప్రథమ, ముత్తుకూరుకు చెందిన శారద ద్వితీయ, సుజాత తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సీఎంఆర్-చందన బ్రదర్స్ అధినేత మావూరి శ్రీనివాస రావు, డైరెక్టర్ సంతోష్ రామ్మోహన్, రాజీ యాడ్స్ పెంచలయ్య, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజరు హరికృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు.





ద్వితీయ, తృతీయ విజేతలు శారద, సుజాత



నెల్లూరు : ప్రథమ విజేత దేవరపల్లి ఉషకు బహుమతి అందజేస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి, సీఎంఆర్-చందన బ్రదర్స్ అధినేతలు మావూరి శ్రీనివాసరావు, సంతోష్ రామ్మోహన్, రాజీ యాడ్స్ పెంచలయ్య తదితరులు

గూడూరులో..



విష్ణుప్రియకు ప్రథమ బహుమతి ఇస్తున్న డీఎస్పీ రమణకుమార్ తదితరులు

గూడూరు : స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన ముగ్గుల పోటీల్లో 45 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతి త్యాగరాజవీధికి చెందిన ఎం.విష్ణుప్రియ , ద్వితీయ బహుమతిని గూడూరు మండలం నెల్లటూరుకు చెందిన ఎన్.సుస్మిత, తృతీయ బహుమతిని సైదాపురం మండలం లింగసముద్రం గ్రామానికి చెందిన ఎం.శేషమ్మ గెలుచుకున్నారు. డీఎస్పీ వీవీ రమణకుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. వీరితోపాటు కన్సోలేషన్, ప్రత్యేక బహుమతులను పాశం సంధ్యారాణి సహకారంతో అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసులు పాల్గొన్నారు.



కావలిలో..

కావలి/కావలిటౌన్ : పట్టణంలోని రైల్వేరోడ్డులోని కారోనేషన్ రీడింగ్ రూము ఆవరణలో ముత్యాల ముగ్గుల పోటీలు కోలాహలంగా జరిగాయి. న్యాయనిర్ణేతల అంచనాలకు అందని విధంగా రంగవల్లులను తీర్చిదిద్దడంతో విజేతల ఎంపిక ప్రక్రియ ఆలస్యమైంది. చివరకు న్యాయనిర్ణేతలు ఉమాశర్మ, జమున, లక్ష్మి విజేతలను ప్రకటించారు. పట్టణంలోని బుడంగుంట కాలనీకి చెందిన వల్లెపు లక్ష్మీ, రెండో బహుమతిని పాతూరు ఈతముక్కల వారి వీధికి చెందిన క్రిష్ణంశెట్టి సరోజనమ్మ, తృతీయ బహుమతిని వెంగళరావునగర్‌కు చెందిన తంగుటూరి శ్రీలక్ష్మి గెలుచుకున్నారు. వీరికి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ, డీఎస్పీ శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్ బహుమతులు అందజేశారు.



కావలి : ప్రథమ బహుమతి విజేత లక్ష్మికి బహుమతి అందజేస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీధర్, కిశోర్ తదితరులు





ద్వితీయ, తృతయ విజేతలు నారాయణమ్మ, శ్రీలక్ష్మి

బోగస్‌పై దృష్టి

నేటి నుంచి పింఛన్ల పరిశీలన

తొలుత దివ్యాంగులు, డీఎంహెచ్‌వో పెన్షన్ల తనిఖీ

వైద్య, సాంకేతిక సిబ్బందితో ప్రత్యేక బృందాలు

గత ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా సదరం సర్టిఫికెట్ల జారీ

వాటి ద్వారా లబ్ధి పొందుతున్నట్లు ఫిర్యాదులు

కొన్ని నిర్ధారణ కావడంతో విచారణకు ఉత్తర్వులు

జలదంకిలో ఓ వ్యక్తి ఆరోగ్యం బాగున్నా దివ్యాంగుల (డిసేబుల్డ్) కోటాలో పింఛన్ పొందుతున్నాడని ఇటీవల ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఈ విషయమై స్థానిక డీఆర్‌డీఏ, వైద్యసిబ్బంది విచారించగా, ఆ వ్యక్తికి ఎలాంటి వైకల్యం లేదని తేలింది. నకిలీ డిసేబుల్డ్ సర్టిఫికెట్‌తో పింఛన్ పొందుతున్నట్లు గుర్తించి పింఛన్‌ను నిలిపేశారు. జిల్లాలో దొంగ సర్టిఫికెట్లతో పింఛన్ పొందుతున్నారనడానికి ఇదొక ఉదాహరణ. ఇలాంటివి ఎన్నో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం, ఆ క్రమంలోనే అధికంగా డిసేబుల్డ్ పింఛన్లు మంజూరు చేయడంతో బోగస్ పింఛన్లపై అనుమానాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో పింఛన్లపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. జిల్లాలో ఈ రెండు కేటగిరీల్లో ఉన్న పింఛన్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. ఈ పింఛన్ల తనిఖీకి సంబంధించిన విధివిధానాలు జిల్లా అధికారులకు అందాయి. సోమవారం నుంచి ఈ తనిఖీలు ప్రారంభం కానున్నాయి.

-నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అన్నిరకాల పింఛన్లు 3,10,029 ఉన్నాయి. అందులో అత్యధికంగా వృద్ధాప్య పింఛన్లు 1,65,356 ఉండగా, మూడో స్థానంలో డిసేబుల్డ్ పింఛన్లు 32,773 ఉన్నాయి. అలాగే డీఎంహెచ్‌వో పింఛన్లు మరో 1978 ఉన్నాయి. డిసేబుల్డ్ పింఛన్ కింద ప్రతినెలా రూ.6 వేలు అందిస్తుండగా, డీఎంహెచ్‌వో పింఛన్ కింద రూ.15 వేలు ఇస్తున్నారు. జిల్లాలో ప్రతినెలా రూ.131.63 కోట్లను పింఛన్ల కింద చెల్లిస్తుండగా, అందులో డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో పింఛన్‌దారులకు సుమారు రూ.22 కోట్లను అందిస్తున్నారు. అయితే ఈ జాబితాలో అనర్హులు కూడా ఉన్నట్లు ఫిర్యాదులు అందాయి. వీటిని పరిశీలించగా కొన్ని నిర్ధారణ జరగడంతో ఆ పింఛన్లను నిలిపేశారు. ఇటీవల ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో పింఛన్లను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా దొంగ సర్టిఫికెట్లతో కొందరు డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో కేటగిరీల కింద పింఛన్లు పొందుతున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ రెండు కేటగిరీల్లోని పింఛన్లను పరిశీలించేందుకు నిర్ణయం తీసుకుంది.

● ప్రత్యేక బృందాల ఏర్పాటు

డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో పింఛన్లు పొందాలంటే కొన్ని నిబంధనలు ఉన్నాయి. శాశ్వత వైకల్యం ఉన్న వారికి మాత్రమే డిసేబుల్డ్ కింద పింఛన్ మంజూరు చేస్తారు. అది కూడా వివిధ కేటగిరీలకు ఇంత పర్సంటేజీ డిసేబులిటీ ఉంటేనే పింఛన్ మంజూరవుతుంది. అలానే పూర్తిగా మంచానికే పరిమితమైనవారికి డీఎంహెచ్‌వో కేటగిరి కింద పింఛను ఇస్తారు. ఈ రెండు కేటగిరీలకు మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది. డిసేబుల్డ్ పింఛను పొందాలంటే సదరం సర్టిఫికెట్ తీసుకోవాలి. ఇప్పుడు ఈ కేటగిరీలకు సంబంధించిన పింఛన్లను తనిఖీ చేసేందుకు డీఆర్‌డీఏ టెక్నికల్ సిబ్బందితో పాటు వైద్యసిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరు ఒక షెడ్యూల్ ప్రకారం పింఛన్ దారుడి వద్దకు వెళ్లి పరిశీలిస్తారు. నిజంగానే పింఛన్ దారుడికి వైకల్యం ఉందా... ఉంటే ఎంత మేరకు ఉంది... వీరు పింఛను పొందేందుకు అర్హులా.. కాదా...? అనే వివరాలను పరిశీలించి నివేదిక రూపొందిస్తారు.

● సదరం స్లాట్ల నిలిపివేత

గత ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా సదరం సర్టిఫికెట్లు జారీచేయడం, వాటిపై అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సదరం స్లాట్లను కూటమి ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపేసింది. వీటిపై విచారణ పూర్తయ్యే వరకు సదరం స్లాట్లను అనుమతించరు. ఇప్పటికే స్లాటు పొందిన వారికి మాత్రం వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

నేటి నుంచి తనిఖీలు

డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో పింఛన్లను పరిశీలించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. తనిఖీలకు వైద్య సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. సోమవారం (నేటి) నుంచి తనిఖీలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ



మామిడికి వర్షం దెబ్బ

ఆలస్యంగా పూత ప్రారంభం

కాపుపై ప్రభావం చూపే అవకాశం

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో అల్పపీడనం, తుపాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు మామిడిలో పూత ఆలస్యమైంది. సాధారణంగా డిసెంబరు రెండు లేదా మూడో వారం నుంచి మామిడిలో పూత ప్రారంభమవుతుంది. ఫిబ్రవరికి బఠాణి గింజంత పిందెలతో మామిడి తోటలు దర్శనమిస్తాయి. అలాంటిది ఇప్పటివరకు పూత పూయలేదు. దీంతో రైతులు తమకు తోచిన విధంగా రకరకాల రసాయనిక మందులు పిచకారి చేస్తున్నారు.

● వేలాది ఎకరాల్లో సాగు

ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో మామిడి సాగు సుమారు 10,000 ఎకరాల్లో ఉంది. ఇప్పటికే కొన్ని తోటల్లో 20శాతం పూత వేయగా, మిగిలిన చెట్లు పూమొగ్గ వేసున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నేలలో తేమ శాతం అధికంగా ఉండటం, పూమొగ్గకు సరిపడా ఉష్ణోగ్రత అందించలేకపోవడంతో పూతకాడలు వేయడం ఆలస్యం అవుతున్నదని రైతులు అంటున్నారు. రానున్న రోజుల్లో వాతావరణంలో ఎలాంటి మార్పులు లేకుండా, వర్షాలు కురకుండా ఉంటే మామిడిలో పూత, పిందె నిలుస్తాయని వారంటున్నారు. అలాకాకుండా విపత్కర పరిస్థితులు ఎదురైతే మామిడిపై ఆశలు వదులుకోవాల్సిందేనని అభిప్రాయ పడుతున్నారు.

ఆలిండియా క్యారమ్స్ పోటీల ప్రారంభం

● జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల రాక ● తొలిరోజు పోరు హోరాహోరీ

నగరంలోని నెల్లూరు క్లబ్‌లో ఏపీ క్యారమ్స్ అసోసియేషన్, జిల్లా క్యారమ్స్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 29వ ఆలిండియా ఫెడరేషన్ కప్ ఛాంపియన్ షిప్‌ను ప్రారంభించారు.స్విట్జర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసఫ్ మేయర్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్యారమ్స్ పోటీలను ఆరంభించారు.ఆలిండియా క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, అసోం పార్లమెంట్ సభ్యుడు రఖిబుల్ హుస్సేన్, జాతీయ, అంతర్జాతీయ క్యారమ్స్ క్రీడాసంఘాల ప్రతినిధులతోపాటు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రపంచకప్ విజేతలు శ్రీనివాస్, ఖజీమా, అర్జున అవార్డు గ్రహీత ఆంథోని మరియు ఇరుదయంతోపాటు ఇతర క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. అనంతరం తొలిరోజు పోటీలు వివిధ రాష్ట్రాల క్రీడాకారుల మధ్య హోరాహోరీగా సాగాయి. మరో మూడురోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి.



ముక్కోటి ఏకాదశికి ఘనంగా ఏర్పాట్లు



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే తొలి ముక్కోటి ఏకాదశి ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ఆదివారం కమిటీ సభ్యులతో కలిసి ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బత్తల వెంకటలక్ష్మీనారాయణ, కదిరి వెంకటమోహన్‌రావు, బొడ్డు శివారెడ్డి, ఉప్పు కొండయ్య, బొడ్డు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిన హిందువులు



సంగం నుంచి హైందవ శంఖారావం సభకు బయలుదేరుతున్న హిందువులు

కందుకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడాలన్న నినాదంతో ఆదివారం విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావం సభకు కందుకూరు నుంచి హిందువులు ప్రత్యేక బస్సుల్లో పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. వీహెచ్‌పీ బాధ్యుడు డాక్టరు తన్నీరు మల్లికార్జున జెండాఊపి వాహనాలను పంపారు. వీరి వెంట బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టుమనేని హరిబాబు, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, హిందూ మతాభిమానులు, మహిళలు ఉన్నారు.

● సంగం : మండలంలోని పలు గ్రామాల నుంచి విజయవాడలో ఆదివారం చేపట్టిన హైందవ శంఖారావం సభకు భారీగా తరలివెళ్లారు. సంగం, సిద్ధీపురం, అన్నారెడ్డిపాళెం తదితర గ్రామాల నుంచి హిందువులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు బస్సులు, కారుల్లో తరలివెళ్లారు.

● వింజమూరు : విజయవాడలో హైందవ శంఖారావం బహిరంగ సభకు వింజమూరు నుంచి 500 మంది హిందువులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కందల మధుసూదన్‌రెడ్డి, డేగ మధుయాదవ్, రమేష్, శార్వాణి, ఏడుకొండలు, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

ఉదయగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 1, 2, 3 తేదీల్లో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆదివారం సీపీఎం నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మండలంలోని బిజ్జంపల్లి, కృష్ణారెడ్డిపల్లి, బండగానిపల్లి, లింగంనేని పల్లి తదితర గ్రామాలు, కాలనీల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. మహాసభలకు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారంలో వైద్య శిబిరం ఏర్పాటు



జ్వరాలపై గ్రామస్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కలువాయి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామంలో ఆదివారం కుల్లూరు పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో జ్వరాలు విజృంభించిన విషయం పత్రికల్లో రావడంతో వైద్య సిబ్బంది స్పందించారు. ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితుల వివరాలు సేకరించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో బ్లీచింగ్, అబేట్ స్ప్రేయింగ్ చేయించారు. మెడికల్ ఆఫీసరు డాక్టర్ అన్వర్ బాషా, పొదలకూరు సబ్ యూనిట్ అధికారి అంజనేయ వర్మ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

మంత్రముగ్గులై!

● ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రంగవల్లుల పోటీలకు అపూర్వ స్పందన



మాట్లాడుతున్న ఆర్డీవో వంశీకృష్ణ, వేదికపై డీఎస్పీ శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్

కావలి, కావలి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముగ్గుల పోటీలకు అపూర్వ స్పందన లభించింది. ఆదివారం స్థానిక రైల్వేరోడ్డులోని కారోనేషన్ రీడింగ్‌రూం ఆవరణలో సంతూర్ సెల్సియా (డిగ్‌సెల్) క్రాఫ్ట్‌వారి పెర్‌ఫెక్ట్ సౌజన్యంతో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు, యువతులు వృద్ధులు సైతం ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా మహిళల సందడితో ఆవరణంలో సంక్రాతి శోభ సంతరించుకుంది. ముఖ్య అతిథులుగా ఆర్డీవో వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సంస్కృతి, సంప్రదాయాలు అంతరించి పోతున్న తరుణంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రతి ఏటా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం అని కొనియాడారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ గుత్తికొండ కిషోర్ ప్రోత్సాహక బహుమతుల దాతగా వ్యవహరించారు. న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు ఎస్.జమున, ఉపాధ్యాయురాలు ఉమాశర్మ, సంగీత గురువు లక్ష్మీప్రశాంతి వ్యవహరించి విజేతలను ఎంపిక చేయడంతో పాటు మహిళలకు కన్సలేషన్ బహుమతులు అందజేశారు.

సంక్రాంతి ముగ్గులను భావితరాలకు అందించాలి : వంశీకృష్ణ, ఆర్డీవో

తన బాల్యంలో సంక్రాంతి పండుగ వస్తే 2వారాల నుంచి సందడి నెలకొనేదని తెల్లవారుజాము నుంచి మహిళలు ఇళ్ల ముందు ముగ్గులు వేసేవారు. ఎవరి ఇంటిముందు బాగుందో అని వీదంతా తిరిగి ఆసక్తిగా ముగ్గులు తిలకించేవాళ్లం. పిండి వంటలు ఎక్కువగా చేసేవారు. సంస్కృతి, సాంప్రదాల్లో భాగమైన సంక్రాంతి ముగ్గులను భావితరాలకు అందించేందుకు కృషి చేయాలి.

ఆరోగ్యానికి.. సుఖశాంతులకు నిలయం : శ్రీధర్, డీఎస్పీ

ఎవ్వరైతే తెల్లవారుజామున లేచి ఇంటిముందు ముగ్గులు వేస్తారో ఆ ఇల్లు ఆరోగ్యానికి, సుఖశాంతులకు నిలయం. ప్రస్తుతం గతంలో వలే ఇళ్ల ముందు ముగ్గులు కనిపించడం లేదు. సెల్‌ఫోనే ప్రపంచం కాకూడదని సంస్కృతి సాంప్రదాలయను విస్మరిస్తే మానవ మనుగడకే ప్రమాదకరం. సంప్రదాయాలు గుర్తుచేేలా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం.

సంక్రాంతికి చిహ్నాలు : గుత్తికొండ కిషోర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు

సంక్రాంతి అంటేనే రంగవల్లులు అని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని ముగ్గులు ఇనుమడింపస్తాయి. గత 25ఏళ్ల నుంచి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వారు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించడం తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటినట్లే అన్నారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని పోటీలో పాల్గొనడంతో తన బాల్యంలోని జ్ఞాపకాలు గుర్తొచ్చాయి.



కావలిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఆత్మకూరులో శరవేగంగా అభివృద్ధి పనులు

● రాష్ట్ర మంత్రి ఆనం



అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆయన పంచాయతీరాజ్ అధికారులు, ఎంపీడీవోలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి విడతగా 199 సిమెంట్ రోడ్లకు రూ. 10.34 కోట్లు మంజూరయ్యాయి.. ఇప్పటివరకు 143 రహదారులను పూర్తిస్థాయిలో నిర్మించాం.. మిగిలిన రహదారుల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి సంక్రాంతి పండుగ అనంతరం ప్రారంభోత్సవాలు చేసి పల్లెల్లో రహదారులను అందంగా ముస్తాబు చేస్తామని తెలిపారు. ఆత్మకూరులోని 10 సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు రూ. 2.66 కోట్లతో పూర్తిస్థాయిలో అన్ని వసతులతో పునర్నిర్మాణం చేపట్టి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాట వేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో అభివృద్ధి పనులను పెద్దఎత్తున చేపడుతున్నామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ముందుగా ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ అధికారులు మంత్రి ఆనం రామనారాయణకు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం: ఎమ్మెల్యే దగుమాటి



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక వికాసానికి క్రీడలు అవసరం అని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ఉదయగిరి రోడ్డులోని మినీ స్టేడియంలో ఆదివారం కావలి స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గ, జలదంకి మండలస్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మినీ స్టేడియంకు మహర్దశ పట్టనుందన్నారు. స్టేడియం చదును చేయటానికి అవసరమైన మట్టి తోలకం ఖర్చును తాను భరిస్తానని హామీ ఇచ్చారు. వాకర్స్‌కు ఇబ్బందులు లేకుండా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో క్రికెట్ నిర్వాహకులు సిద్దు, బుర్లా శ్రీధర్‌రెడ్డి, దేవరకొండ శ్రీను, ఆళ్ల శ్రీను టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్‌బాబు, పోట్లూరి శ్రీనివాసులు, మదన్‌మోహన్‌రెడ్డి, విక్రమరెడ్డి, మొగిలి కల్లయ్య, గంగినేని వేంకటేశ్వర్లు, శానం హరి, జనిగర్ల మనోహర్, పులిమి రామిరెడ్డి పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు ప్రారంభం

కావలి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీజీ కళాశాల క్రీడా ప్రాంగణంలో అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలను ఆదివారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శైలజ ప్రారంభించారు.కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్‌గా ప్రసాద్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరి మణికంఠ, పీడీలు శ్రీనివాసులు, తిరుపాల్, బ్రహ్మయ్య, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

వింజమూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఒంగోలు సీనియర్ పిరమిడ్ మాస్టర్స్ సాయిరాం, లక్ష్మీ దంపతులు తెలిపారు. శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యతను వివరిసూ కరపత్రాలు పంచారు. పిరమిడ్ నగర్, చెన్నకేశవస్వామి బజారు, సీతారామ తోట వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. హాజరైన ధ్యానులందరికీ నూతన సంవత్సర క్యాలెండర్లను పంపిణీచేశారు. అనంతరం మాస్టర్లను సత్కరించారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

సీతారామపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలోని సబ్‌స్టేషన్ వద్ద జాలీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభించారు. మొదటి రోజు ఆటలో మారంరెడ్డిపల్లి, సీతారామపురం బెస్తకాలనీ టీంలు పాల్గొన్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ సీనియర్ నాయకులు తోట మనోహర్, షేక్ బాబు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

బిట్రగుంట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):ముంగమూరు జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఆదరణ కేంద్రంలోని పేదలు, అనాథలు, అభాగ్యులకు ఆదివారం భీమ్ హనుమంతరావు జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతలు శివకుమార్, వనజ దంపతులు, కుటుంబ సభ్యులు సాయితేజ, వనిత, సుమంత్, మానస, భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఆదరణ కేంద్ర డైరెక్టర్ సింహాద్రిరావు ఉన్నారు.

ఘనంగా కమ్మ సేవా సమితి సంక్రాంతి సంబరాలు

● కులమతాలకతీతంగా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు గురజాల మాల్యాద్రి

కావలి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దపవని రోడ్డులోని కూచి చిరమాలకొండ క్షేత్ర ప్రాంగణంలో ఆదివారం కమ్మవారి సేవాసమితి సభ్యులు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ రాష్ట్ర నాయకుడు గురజాల మాల్యాద్రి నాయుడు, రాష్ట్ర ఖాదీబోర్డు చైర్మన్ కెకె.చౌదరి, రాష్ట్ర కాకతీయ సేవాసమితి జనరల్ సెకరట్రీ బెజవాడ వెంకట్రావ్, మాలేపాటి రవీంద్రనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కులమతాలకతీతంగా 35మంది పేద విద్యార్థులకు రూ.2లక్షల స్కాలర్‌షిప్‌లను అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా భోగి మంటలు, మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు, ఆటలపోటీలు చేపట్టారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమ్మవారి సేవాసమితి అధ్యక్షుడు మాకినేని మాల్యాద్రి నాయుడు, ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, గౌరవాధ్యక్షుడు గడ్డం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు దేవినేని వెంకటరమణయ్య, కంకణాల సుందరయ్య నాయుడు, మామిళ్లపల్లి అంజనేయచౌదరి, రావెళ్ల వెంకటరాయుడు, చల్లా వెంకటేశ్వర్లు, ఆరుముళ్ల వెంకటేశ్వరరావు, వర్దినేని భాస్కర్ నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

● షేక్ కరీముల్లా, పంచాయతీ ఈవో



ఉదయగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఉదయగిరి మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ కరీముల్లా తెలిపారు. పంచాయతీలో గల 16 వార్డుల పరిధిలో మురుగు కాలువలను శుభ్రం చేయడంతోపాటు వీధుల శుభ్రతకు చర్యలు చేపడుతున్నామన్నారు.

? : ఇంటి పన్నుల వసూలు చేపడుతున్నారా.

! : పట్టణంలో 3,500 నివాసాలు ఉన్నాయి. డిజిటలైజేషన్ చేపట్టాం. త్వరలో ఇంటిపన్నుల వసూళ్లకు చర్యలు చేపడతాం.

?: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తున్నారా.

! : పట్టణంలోని మూడు సచివాలయాల పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు సమయ పాలన పాటిస్తున్నారు. తరచూ సచివాలయాల తనిఖీలు చేపట్టి విధులకు హాజరు కాని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు చేపడుతున్నాం.

?: పంచాయతీ అభివృద్ధికి ఏం చర్యలు తీసుకుంటున్నారు.

! : సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గ సమావేశాలు నిర్వహిస్తూ సమస్యలపై తీర్మానాలు చేసి పరిష్కరిస్తున్నాం. పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.

న్యూస్ బాక్స్

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సంగం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

సావిత్రీబాయి పూలేకు నివాళి

కందుకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళాశాలల, బాలికల బీసీ హాస్టల్‌లో బహుజన టీచర్స్ అసోసియేషన్ మహిళా విభాగం సభ్యులు ఆదివారం సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీటీఏ మహిళా నేత సమత విద్యార్థినులకు స్వీట్లు, రైటింగ్‌ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో బీటీఏ జిల్లా మహిళా కార్యదర్శి ఏ అరుణకుమారి, సుభాషిణి, షర్మిల, మంగమ్మ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల ప్రారంభం

సంగం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు తూర్పు దళితవాడలో రూ. 3 లక్షల నిధులతో డ్రైనేజీ పనులు ఆదివారం ప్రారంభించారు. డ్రైనేజీ లేక కాలనీవాసులు గత కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రూ. 3 లక్షల పంచాయతీ నిధులతో డ్రైనేజీ పనులు చేస్తున్నారు. పనులు పూర్తయితే కాలనీలో ప్రధాన సమస్య కొంతవరకు తీరినట్లవుతుందని కాలనీ వాసులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కావలి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మునునూరులోని ఆదివారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి గౌడ్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు పెనుగొండయ్యగౌడ్, కార్యదర్శి బ్రహ్మయ్య గౌడ్, ఉప్పాల శ్రీనివాసులు, తుళ్లూరు శ్రీనివాసులు, సురేష్, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

దోమతెరలు, దుప్పట్ల అందజేత

కావలి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని గిరిజన బాలుర వసతిగృహం విద్యార్థులకు ఆదివారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెంచల నరసింహారెడ్డి మిత్రబృందం సభ్యులతో కలిసి దోమతెరలు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఆంజనేయులు, శ్రీనివాసరావు, రమణయ్య, పాల్గొన్నారు.

అన్నవరంలో వైద్యశిబిరం

జలదంకి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాలతో గట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి పద్మజ, సిబ్బంది ఆదివారం అన్నవరంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 129 మందిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. జ్వరాలు తగ్గేవరకు వైద్యశిబిరం కొనసాగుతుందని వైద్యాధికారి తెలిపారు. అనంతరం పంచాయతీ అధికారులు, సిబ్బందితో కలిసి గ్రామంలో పారిశుధ్య పనులు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్తమ్మ, టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి ఉన్నారు.